పాత వాహనాలు కొనేముందు పత్రాలు సరిచూసుకోండి: సీపీ



ఖమ్మం నేరవిభాగం: పాత వాహనాలు కొనే సమయంలో సంబంధిత పత్రాలను తనిఖీ చేసుకోవాలని సీపీ సునీల్‌దత్ సూచించారు. పోలీసు కేసులు ఉన్నాయేమో చూసుకోవాలని, బీమా, ఆర్సీ బుక్, ఛాసిస్ నంబర్, తయారీ తేదీ, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటి పత్రాలు సరి చూసుకోవాలన్నారు. పోలీసు తనిఖీల్లో ఫైనాన్స్ ద్వారా తీసుకున్న ద్విచక్ర వాహనాలు సరైన పత్రాలు, నెంబరు ప్లేట్, రిజిస్ట్రేషన్ లేకుండా పట్టుబడుతున్నాయన్నారు. కమిషనరేట్ పరిధిలోని సెకండ్ హ్యాండ్ ఆటో ఫైనాన్స్‌లో ఉన్న వాహనాల పత్రాలు తనిఖీ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించామన్నారు. ఎవరైనా వాహనాలను కొన్నా.. ఆమేరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు.

◆ ఇటీవల చైన్‌స్నాచింగ్, దొంగతనాలు చేసే నిందితులు.. పోలీసులు, సీసీ కెమెరాల నుంచి తప్పించుకునేందుకు ద్విచక్రవాహనాల నంబరు ప్లేట్లు తొలగిస్తున్నారని సీపీ అన్నారు. చోరీ చేసిన వాహనాలతోనే ఎక్కువ నేరాలు జరుగుతున్నాయని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా నిబంధనలు అతిక్రమించి జరిమానాలు తప్పించుకునేందుకు నంబరు ప్లేట్ వంచినా, కప్పివేసినా, పూర్తిగా లేకుండా చేసినా వాహనాలను స్వాధీనపరచుకొని కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు.

ఇన్‌ఛార్జి ఎంఈఓల నియామకం

కూసుమంచి: పాఠశాలల పర్యవేక్షణలో కీలకమైన ఎంఈఓల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఒక్కో ఎంఈఓ మూడు నుంచి నాలుగు మండలాల బాధ్యతలు నిర్వర్తించాల్సి రావటంతో పర్యవేక్షణ గాడితప్పుతోంది. ఈ నేపథ్యంలో ప్రతి మండలానికి పర్యవేక్షకులు ఉండాలని ప్రభుత్వం భావించింది. మండలంలో సీనియర్ ఉపాధ్యాయులను ఇన్‌ఛార్జి ఎంఈఓలుగా బాధ్యతలు అప్పగించింది. ఖమ్మం జిల్లాలో మండలాల వారీగా నియమితులైన ఇన్‌ఛార్జి ఎంఈఓల వివరాలు.. కొణిజర్ల-డి.అబ్రహం, వైరా-కె.వెంకటేశ్వరరావు, వేంసూరు- సీహెచ్ వెంకటేశ్వరరావు, ఏన్కూరు-హెచ్.శ్రీనివాస్, తల్లాడ- ఎన్.డి.ప్రసాద్, మధిర- వై.ప్రభాకర్, చింతకాని- వి.శ్రీనివాసరావు, బోనకల్లు-డి. పుల్లయ్య, పెనుబల్లి-ఎస్.సత్యనారాయణ, సింగరేణి- డి.జయరాజు, కల్లూరు-పి.నివేదిత, ఎర్రుపాలెం-బి.మురళీమోహన్‌రావు, ముదిగొండ- డి.రమణయ్య, కామేపల్లి-జి.వెంకట్, సత్తుపల్లి- ఎన్.రాజేశ్వరరావు, ఖమ్మం(అర్బన్)-కె.వి. శైలజాలక్ష్మీ, కూసుమంచి-ఆర్.వీరస్వామి, నేలకొండపల్లి- బి.చలపతిరావు, తిరుమలాయపాలెం-ఎం.శ్రీనివాసరావు.

ప్రథమ సంవత్సరం ఫలితాలు విడుదల

ఖమ్మం వైద్యవిభాగం: ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షల ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. పరీక్షలు రాసిన విద్యార్థుల్లో ముగ్గురు డిస్టింక్షన్, 61 మంది ఫస్ట్‌క్లాస్, 33 మంది సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. తొలి ఏడాదిలోనే కళాశాల మంచి ఫలితాలు సాధించడంపై అధ్యాపక బృందాన్ని అభినందించారు.

ఆర్టీసీలో పలువురికి ఉద్యోగోన్నతి

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో 20 మంది డ్రైవర్లు, కండక్టర్లకు అసిస్టెంట్ డిపో క్లర్క్(ఏడీసీ)లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. అనంతరం వారిని వివిధ డిపోలకు కేటాయిస్తూ బదిలీ చేశారు. అలాగే ఏడీసీలు పని చేస్తున్న ఐదుగురికి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. మరో పది మంది ఏడీసీ, కంట్రోలర్లను బదిలీ చేశారు. వీరందరికీ ఖమ్మం ప్రాంతీయ మేనేజర్ కార్యాలయంలో కౌన్సెలింగ్‌ను మంగళవారం నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఖమ్మం న్యాయవిభాగం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛభారత్ పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా కోర్టులో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ ఆశించిన 'స్వచ్ఛభారత్' సాకారం కావాలంటే సమాజంతోపాటు ప్రతి ఒక్కరి మనసు స్వచ్ఛంగా ఉండాలన్నారు. న్యాయాధికారులు కె.ఉమాదేవి, వి.అపర్ణ, డి.రాంప్రసాదరావు, ఎం.కల్పన, వి.మాధవి, తదితరులు పాల్గొన్నారు.



చీపురు పట్టి కోర్టు ఆవరణను శుభ్రం చేస్తున్న జిల్లా జడ్జి జి.రాజగోపాల్, న్యాయాధికారులు


దంచికొట్టిన వాన

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లాలో మంగళవారం వాన దంచికొట్టింది. ఉదయం 8:30 నుంచి రాత్రి 7 వరకు 155.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మేఘావృతమై పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఖమ్మం నగరంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. అత్యధికంగా పెనుబల్లి మండలంలో 50.3 మి.మీ, అత్యల్పంగా ఎర్రుపాలెం మండలంలో 0.5 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా నమోదైన వర్షపాతం వివరాలిలా.. (మిల్లీ మీటర్లలో..) పెనుబల్లి 50.3, వేంసూరు 17.8, సత్తుపల్లి 17.7, తల్లాడ 15.8, కామేపల్లి 13.3, కొణిజర్ల 10.4, ఖమ్మం అర్బన్ 9.5, రఘునాథపాలెం 6.9, ఏన్కూరు 4.7, సింగరేణి 4.3, కల్లూరు 2.0, ముదిగొండ 1.1, వైరా 1.0, ఎర్రుపాలెం 0.5.

మంచినీటి ఇక్కట్లు తప్పినట్లే!

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం

గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. తాగునీటి నాణ్యత పరిశీలనతో పాటు బోర్లు, మోటర్లు పాడైతే అదేరోజు మరమ్మతులు జరిగేలా, పైపులైన్ల లీకేజీలను అరికట్టేలా గ్రామ మంచినీటి సహాయకులను నియమించింది. ఇందులో భాగంగా ప్రతి గ్రామానికి ఒక్కరు (మేజర్ పంచాయతీలకు ఒకరి కంటే ఎక్కువ) బహుళ నైపుణ్యం కలిగిన కార్మికుల (మల్టీ స్కిల్డ్ వర్కర్స్)ను ఎంపిక చేసి శిక్షణ ఇస్తోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'నల్ జల్ మిత్ర' పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తోంది.



ఒక్కో అంశానికి ఒక్కో మాస్టర్ ట్రైనీ

గ్రామ మంచినీటి సహాయకులకు చేతిపంపుల మరమ్మతులు, పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టడం, విద్యుత్తు మోటర్ల మరమ్మతులు, నీటి నాణ్యత పరిశీలన అంశాలపై శిక్షణనిస్తారు. ఒక్కో అంశానికి ఒకరి చొప్పున ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచి ఎనిమిది మందిని మాస్టర్ ట్రైనీలుగా గుర్తించి ఈనెల 13న హైదరాబాద్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో అవగాహన కల్పించారు. అనంతరం మాస్టర్ ట్రైనీలు ఆయా జిల్లాలోని మండల స్థాయిలో సంబంధిత ఏఈలకు తర్ఫీదు ఇచ్చారు.

సత్వర పరిష్కారంతో స్వయం ఉపాధి

మంచినీటి సహాయకుల ద్వారా ప్రతి గ్రామంలో ఒకరికి స్వయం ఉపాధి లభించనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సుమారు 1,100 మందికి ఉపాధి దొరకనుంది. స్థానికంగా ఉంటూ, ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై, వయస్సు 45ఏళ్లకు మించనివారు గ్రామ మంచినీటి సహాయకులుగా ఎంపికయ్యారు. వీరికి ప్రభుత్వం తరఫున ఎలాంటి జీతభత్యాలు ఉండవు. ఆయా గ్రామాల్లో చేతిపంపులు, మోటర్ల మరమ్మతులు, పైపులైన్ల లీకేజీలను అరికట్టడం, మంచినీటి నాణ్యత పరిశీలన, ట్యాంకులను శుభ్రపరచటం వంటి పనులకు చేస్తూ అందుకయ్యే ఖర్చులను పంచాయతీ నిధుల నుంచి పొందాల్సి ఉంటుంది. ఈపథకం వల్ల కొందరికి స్వయం ఉపాధి లభించటంతో పాటు తాగునీటి సరఫరాకు ఆటంకాలు ఎదురుకాబోవని అధికారులు భావిస్తున్నారు.



చేతిపంపు మరమ్మతులపై సుజాతనగర్‌లోని రైతు వేదికలో కొనసాగుతున్న శిక్షణ


నాలుగు రోజుల శిక్షణ

ఎంపిక చేసిన గ్రామ మంచినీటి సహాయకులకు ఒక్కోరోజు ఒక్కో అంశంపై శిక్షణ అందుతోంది. భద్రాద్రి జిల్లాలో మొదటగా కొత్తగూడెం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తర్ఫీదు ఇస్తుండగా.. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, వైరా, పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో ఒక్కోచోట శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతి గది పాఠాలతో పాటు క్షేత్రస్థాయిలో ఎలా పని చేయాలనేది నేర్పిస్తున్నారు. అనంతరం అదేరోజు పరీక్ష నిర్వహించి ఏమేరకు అవగాహన పెంచుకున్నారనేది పరిశీలిస్తున్నారు. అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ధ్రువపత్రాలు అందించనున్నారు.

గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ తరగతులు అక్టోబర్ 18 వరకు కొనసాగనున్నాయి. ఈకార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలకు సత్వర పరిష్కారం దొరకనుంది. జిల్లాలో 589 మందికి స్వయం ఉపాధి లభించనుంది.

- పుష్పలత, మిషన్ భగీరథ ఈఈ

అన్నదాతలకు ఆదాయం అదనం



ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, ఖమ్మం నగరం

సన్నరకాలు సాగుచేస్తున్న అన్నదాతలకు ప్రభుత్వం తీపికబురు అందించింది. ఈ ఖరీఫ్ సీజన్ నుంచే మార్కెట్‌కు తీసుకొచ్చే సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రకటించింది. తద్వారా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సుమారు 2 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. రాష్ట్రంలో రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తామని, రైతులకు ధాన్యంపై క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం విదితమే.

ఉభయ జిల్లాల్లో..

సన్నరకాలకు బోనస్ అందించే పథకాన్ని ఈ ఏడాది నుంచే అమలుచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సన్నవడ్ల సాగు వైపే అన్నదాతలు మొగ్గు చూపారు. ఖరీఫ్ సీజన్‌లో ఖమ్మం జిల్లాలో సుమారు 1.20లక్షల మంది రైతులు 2,62,681 ఎకరాల్లో సన్నాలు సాగుచేస్తుండగా.. కేవలం 19,333 ఎకరాల్లో దొడ్డువడ్లను పండిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 84,938 మంది అన్నదాతలు 1.55 లక్షల ఎకరాల్లో సన్నరకాల సాగుకే జైకొట్టారు. గత రబీ సీజన్‌లో సైతం ఉభయ జిల్లాల్లోని రైతులు అధిక మొత్తంలో సన్నరకాలు సాగుచేయటం విశేషం. డిమాండ్ ఉండటం, వ్యాపారులు పంట పొలాల్లోనే ధాన్యం కొనుగోలు చేయడం వంటి కారణాలతో రైతుల సన్నాల సాగుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఈఏడాది ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించటంతో అన్నదాతలకు మరింత మేలు జరగనుంది.

దిగుబడి తగ్గినా..

సాధారణంగా దొడ్డు రకాలతో పోల్చితే సన్నవడ్ల దిగుబడి తక్కువ. సాగు వ్యవధి, చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. అయితే ధర విషయంలో సన్నాలకు కలిసొస్తుంది. గత రబీ సీజన్‌లో దొడ్డు రకాల కంటే ప్రైవేట్ మార్కెట్‌లో సన్నరకాలకు రూ.500 నుంచి రూ.600 అధికంగా ధర లభించింది. రైతులు పండించిన సన్నవడ్లను ప్రైవేటు వ్యాపారులే కొనుగోలు చేశారు. దీనికి తోడు ఇంటి అవసరాలకు రైతులు కొంత ధాన్యాన్ని దగ్గర పెట్టుకోవటంతో ప్రభుత్వానికి అవసరమైన సన్నవడ్లు మార్కెట్‌లో దొరకటం లేదు. అందుకే ప్రభుత్వం.. సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది. దీనివల్ల ఉభయ జిల్లాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులకు దిగుబడి తగ్గినా.. మద్దతు ధర, బోనస్ లభిస్తుండటంతో లాభాలు ఆర్జించే అవకాశముంటుంది.

నవంబర్ నుంచి కొనుగోళ్లు

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనాలని భావిస్తున్న ప్రభుత్వం.. పంటలు చేతికొచ్చే కాలాన్ని బట్టి అక్టోబరు మొదటి వారం నుంచి రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని నిర్ణయించింది. నవంబర్ మొదటి వారంలో భద్రాద్రి జిల్లాలో, నాలుగో వారంలో ఖమ్మం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. దొడ్డు, సన్నరకం వడ్లకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన సన్నవడ్లను మరాడించి రేషన్ దుకాణాల ద్వారా అందించనున్నారు. గతంలో ఉభయ జిల్లాల్లో అవకతవకలకు పాల్పడిన మిల్లులకు ఈసారి ధాన్యం కేటాయించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోనున్నారు.

ముంపు ప్రాంతాల్లో పొంగులేటి పర్యటన

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: మున్నేరు వరద ముంపు ప్రాంతమైన రాజీవ్ గృహకల్ప, జలగంనగర్ ప్రాంతాల్లో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పర్యటించారు. ద్విచక్ర వాహనంపై తిరుగుతూ వరద బాధితులను పరామర్శించారు. సహాయక చర్యలు, ప్రభుత్వ సాయం గురించి ఆరా తీశారు. తమకు ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదని కొందరు బాధితులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే అధికారులను పిలిచి ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయం అందాలని, మరోసారి ఇంటింటి సర్వే చేపట్టి అర్హులను గుర్తించాలని మంత్రి ఆదేశించారు. అనర్హులకు పరిహారం అందడానికి వీల్లేదని స్పష్టం చేశారు. వీధులన్నీ శుభ్రం చేసి దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లాలని సూచించారు. ముంపు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీఓ గణేశ్, తహసీల్దారు రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఎంపీఓ రాజారావు, కాంగ్రెస్ నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, కళ్లెం వెంకటరెడ్డి, మద్ది వీరారెడ్డి, భుజంగరెడ్డి, శ్రీను, మహేశ్, అశోక్‌నాయక్ పాల్గొన్నారు.



జలగంనగర్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మున్నేరు రక్షణ గోడల నిర్మాణంలో మార్పులు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఈటీవీ, ఖమ్మం: ఖమ్మం నగరంలో మున్నేరుకు రెండు వైపులా చేపట్టిన రక్షణ గోడల నిర్మాణంపై నిపుణుల సూచనలు పాటిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మరో వందేళ్ల ఏళ్ల పాటు ఎంత వరద వచ్చినా ఇబ్బందులు కలగకుండా నిర్మాణం చేపడతామని తెలిపారు. త్వరలోనే నిపుణుల కమిటీ మున్నేరును పరిశీలించి రక్షణ గోడలు ఎలా నిర్మించాలి, ఎంత పొడవు ఉండాలనే అంశాలపై అధ్యయనం చేస్తుందని చెప్పారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత డిజైన్ ప్రకారం రక్షణ గోడల నిర్మాణం జరగబోదని స్పష్టం చేశారు. మున్నేరు వరదలతో ప్రకాశ్‌నగర్ వంతెనలోని 24 స్పాన్లు పక్కకు జరిగాయని, తొమ్మిది స్పాన్లు దెబ్బతిన్నాయని వెల్లడించారు. దెబ్బతిన్న ఒక్కో స్పాన్‌ను యథాతథ స్థితికి తీసుకురావటానికి పది రోజుల సమయం పడుతుందని తెలిపారు. హైడ్రాలిక్ సిస్టంతో స్లాబులను కూర్చోబెట్టాల్సి ఉందన్నారు. పది రోజుల్లో పనులు మొదలుపెట్టి వంద రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలకుండా మున్నేరు పాత చప్టాపై నుంచి రాకపోకలు సాగించే ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. ఖమ్మం నగరంలో అక్రమ నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఖమ్మంలో గతంలో వరద కాల్వలు, నదుల ప్రవాహం ఎలా ఉండేదనే అంశంపై నేషనల్ రిమోట్ సెన్సెస్ అధ్యయనం చేసి నివేదిక ఇస్తుందని తెలిపారు. తదనంతరం శాటిలైట్ చిత్రాల ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఒక్క సెంటీమీటర్ జాతీయ రహదారులు లేని ఉమ్మడి ఖమ్మం జిల్లా.. ఇప్పుడు రాష్ట్రంలోనే అత్యధిక జాతీయ రహదారులతో భాసిల్లుతోందని పేర్కొన్నారు. ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి నిర్మాణ పనులను ఉగాది వరకు పూర్తిచేస్తామన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం నగర కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ శ్రీజ, జలవనరులశాఖ సీఈ విద్యాసాగర్, ఆర్‌అండ్‌బీ సీఈ మోహన్ పాల్గొన్నారు.



రేమిడిచర్లలో పారిశ్రామిక కేంద్రానికి కేటాయించిన స్థలం

చిగురిస్తున్న ఆశలు

ఎర్రుపాలెం, మధిర పట్టణం, న్యూస్‌టుడే

ఎర్రుపాలెం మండలంలోని రేమిడిచర్ల గ్రామ సమీపంలోని సర్వే నంబరు 372లోని 58 ఎకరాల స్థలాన్ని పారిశ్రామిక పార్కుకు కేటాయిస్తూ ఈనెల 20న రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. తద్వారా ఇక్కడ పారిశ్రామిక కేంద్రం ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి.

అప్పట్లో కేటాయించినా.. రేమిడిచర్ల సమీపంలోని 58 ఎకరాల గ్రామకంఠం భూమిని పారిశ్రామిక కేంద్రం ఏర్పాటుకు సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ స్పీకర్ మల్లు భట్టివిక్రమార్క చొరవతో కేటాయించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటంతో పరిశ్రమలు ఏర్పాటు చేస్తారని నిరుద్యోగులు ఎదురుచూసినా దాదాపు పదేళ్లు కార్యరూపం దాల్చలేదు. నిరుద్యోగులు ఏపీలోని కృష్ణా జిల్లాలోని పారిశ్రామికవాడల్లో రోజువారీ కూలీలుగా వలస వెళుతున్నారు. పారిశ్రామిక పార్కుకు కేటాయించిన భూమి.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలోని వాణిజ్య నగరం విజయవాడకు కేవలం 40 కి.మీ. దూరంలోనే రహదారి, రైల్వేట్రాక్ పక్కనే ఉండటం గమనార్హం.

◆ పది సంవత్సరాల అనంతరం మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వ రావడంతో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రత్యేక దృష్టి సారించారు. ఆ భూమిని పారిశ్రామిక పార్కుకు కేటాయిస్తూ మంత్రివర్గం ఇటీవల తీర్మానించింది. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటవుతుందని నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

◆ వ్యవసాయం అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తే నిరుద్యోగులు, రైతు కూలీలకు ఆసరాగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని ఈప్రాంత వాసులు కోరుతున్నారు. జులై నెలలో డ్రోన్ పరీక్ష కేంద్రం ఏర్పాటుకు ఏవియేషన్ అధికారుల బృందం వచ్చి ఈ భూములను పరిశీలించి వెళ్లింది.

ఎట్టకేలకు సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల



కూసుమంచి, న్యూస్‌టుడే: సాగర్ ఎడమ కాల్వకు పాలేరు జలాశయం నుంచి మంగళవారం ఉదయం నీటిని విడుదల చేశారు. ఈనెల 1న పాలేరు వరద ఉద్ధృతి కారణంగా పాలేరు జలాశయం దిగువన అండర్ టన్నెల్ ధ్వంసమవటంతో పాటు, కట్టకు ఇరువైపులా భారీ గండి పడిన విషయం తెల్సిందే. ఎదురైన అనేక అవాంతరాలను అధిగమించి యూటీ కట్టడాన్ని తొలగించి, గండ్లు పూడ్చిన అధికారులు మంగళవారం తెల్లవారుజామున పని ప్రదేశంలో కాల్వలో ఏర్పాటు చేసిన రింగ్‌బండ్‌ను తొలగించి తొలుత నీటిని వదిలారు. సుమారు 600 మీటర్ల పరిధిలో నిల్వ ఉన్న నీరు కాల్వలో ప్రవహించిన అనంతరం ఔట్‌ఫాల్ రెగ్యులేటర్ ఏఈ, ఇక్రాం అహ్మద్, సిబ్బంది గేట్లు ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాయంత్రం వరకు 2 వేల క్యూసెక్కులకు పెంచారు. నీటిని వదిలిన అనంతరం గండి ప్రదేశంతో పాటు కాల్వ పొడవునా పర్యవేక్షించారు.

ఎండిన పొలాలను పరిశీలించిన కలెక్టర్

సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో నీరందక ఎండిపోయిన వరి క్షేత్రాలను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరిశీలించారు. మల్లాయిగూడెం, జుజ్జులరావుపేట గ్రామాల్లో పలు క్షేత్రాలను సందర్శించి జరిగిన నష్టంపై ఆరా తీశారు. జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఏడీఏ సరిత, ఏఓ వాణి, ఏఈఓ రవితేజ పాల్గొన్నారు.



జలకాలాట సాగర్ ఎడమ కాల్వ గండి పూడ్చిన అనంతరం మంగళవారం పాలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు. కొద్దిసేపటికే నీటి కాకులు, కొంగలు కాల్వలో సందడి చేశాయి. పనిలో పనిగా కంటబడ్డ చేపలను నోటకరుచుకెళ్లాయి. - కూసుమంచి, న్యూస్‌టుడే

కార్మికుల భద్రత గాలిలో దీపం

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే

గ్రానైట్ పరిశ్రమల్లో పనిచేసే అసంఘటిత కార్మికులకు రక్షణ కరవైంది. నిత్యం బండరాళ్లను పగలగొట్టి అందమైన పలకలుగా తీర్చిదిద్దే శ్రామికులకు భద్రత లేకుండా పోతోంది. ఎటువంటి రక్షణ ఉపకరణాలు లేకుండా పనిచేస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి పొట్టకూటి కోసం వచ్చే కార్మికుల ప్రాణాలు పోతే పట్టించుకునే నాథుడే లేడు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం గ్రామీణం, తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మం అర్బన్, ఏన్కూరు మండలాల్లో క్వారీలు విస్తరించి ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు.



గ్రానైట్ క్వారీలో కాళ్లకు బూట్లు లేకుండా పనిచేస్తున్న కార్మికులు (పాత చిత్రం)

ప్రమాద ఘటనలు కొన్ని..

ఆగస్టు 6న ఖమ్మం గ్రామీణ మండలం ఆరెంపులలోని ఓ గ్రానైట్ పరిశ్రమలో రాజస్థాన్‌కు చెందిన మిషన్ ఆపరేటర్ జగదీప్ సింగ్(48) మోటార్ మరమ్మతులు చేస్తూ విద్యుత్తు షాక్‌కు గురై మరణించాడు. జులై 20న గుర్రాలపాడులోని ఓ పరిశ్రమలో పశ్చిమ్‌బంగా.. 24 దక్షిణ పరగణాల జిల్లాకు చెందిన కుసదాస్ జనా(19) బ్లాక్ గ్రానైట్ రాయి కట్ చేస్తూ విద్యుత్తు షాక్‌కు గురై మరణించాడు. ప్రమాద ఘటనల్లో కొన్ని మాత్రమే వెలుగు చూస్తున్నాయి. చాలా మరుగున పడిపోతున్నాయి. పలువురు క్షతగాత్రులవుతున్నారు. వీరికి ఎంతోకొంత పరిహారం ముట్టజెప్పి స్వస్థలాలకు పంపేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో తమిళనాడు, రాజస్థాన్, పశ్చిమ్‌బంగా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు.

నిబంధనలు ఏం చెబుతున్నాయి

కార్మికులకు పని ప్రదేశంలో రక్షణ కల్పించాలి. శిరస్త్రాణాలు, కళ్లద్దాలు, చేతులకు తొడుగులు, బూట్లు ఇవ్వాలి. నైపుణ్యం కలిగిన కార్మికులతో పనిచేయించాలి. అవసరమైన శిక్షణ అందించాలి. ప్రాథమిక వైద్య సదుపాయం కల్పించాలి. క్వారీల్లో రాళ్ల పగలగొట్టేందుకు పేలుడు పదార్థాలు (జిలెటిన్ స్టిక్స్) ఉపయోగిస్తారు. క్వారీ విస్తీర్ణం ఐదు హెక్టార్లు దాటితే చెన్నైలోని అధికారుల నుంచి, అంతకన్నా తక్కువ విస్తీర్ణమైతే స్థానిక ఏసీపీ.. ఆపై స్థాయి అధికారి నుంచి అనుమతులు తీసుకోవాలి.

జిల్లాలో బ్లాక్ గ్రానైట్ క్వారీలు	స్టోన్ అండ్ మెటల్ క్వారీలు	గ్రానైట్ కటింగ్ పరిశ్రమలు
126	48	435

గ్రానైట్, స్టోన్ మెటల్ క్వారీల్లో కార్మికుల భద్రత అంశం హైదరాబాద్‌లోని మైన్ సేఫ్టీ అధికారులు పర్యవేక్షిస్తారు. యజమాన్యాలు.. కార్మికులకు రక్షణ పరికరాలు అందించాలి. పేలుళ్ల అనుమతులు మా పరిధిలోకి రావు. వేర్వేరు శాఖల అధికారులు క్వారీలు, కటింగ్ పరిశ్రమలను పర్యవేక్షిస్తుంటారు. కార్మికుల వివరాలు మాశాఖ వద్ద ఉండవు.

- సాయినాథ్, గనుల శాఖ సహాయ సంచాలకుడు, ఖమ్మం

మహిళా ప్రాంగణంలో బోధనా పోస్టులకు దరఖాస్తులు

ఖమ్మం కమాన్‌బజార్: ఖమ్మం మహిళా ప్రాంగణంలో టైలర్, బ్యూటీషియన్ బోధనా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణ మేనేజర్ వేల్పుల విజేత మంగళవానం తెలిపారు. ఆసక్తి గలవారు శనివారం మధ్యాహ్నం 2 గంటలలోపు నగర సమీపంలోని టేకులపల్లి మహిళా ప్రాంగణం కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. పీఎం విశ్వకర్మ యోజన ద్వారా వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అర్హులైన మహిళలు శనివారంలోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. టైలరింగ్, బుట్టలు, చీపుర్ల తయారీ, బ్యూటీషియన్, బొమ్మల తయారీలో ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.4వేలు ఉపకార వేతనం, రూ.15వేల టూల్ కిట్ అందిస్తామని వివరించారు. ఆసక్తి గలవారు ఫొటో, ఆధార్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు 76600 22512 నంబర్‌ను సంప్రదించాలన్నారు.





టేకులపల్లి పంచాయతీ ఆవరణలో ఎకోబ్రిక్స్‌తో నిర్మించిన మొక్కల కుండీ, బస్‌షెల్టర్‌పై...

వ్యర్థం.. ఉపయోగార్థం



ఎకోబ్రిక్స్ నిర్మాణం చేస్తున్న పంచాయతీ కార్మికులు

టేకులపల్లి, న్యూస్‌టుడే

ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ సీసాలు, పాలిథిన్ కవర్లు కుప్పలుతెప్పలుగా దర్శనమిస్తున్నాయి. భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తాను పాల్గొనే ప్రతి సమావేశంలో ప్లాస్టిక్ నియంత్రణ ప్రాధాన్యం గుర్తుచేస్తున్నారు. ప్లాస్టిక్ సీసాల్లో పాలిథిన్ కవర్లను నింపి వాటి సాయంతో ఎకో బ్రిక్ తయారు చేసుకోవాలని సూచించారు. టేకులపల్లి పంచాయతీ కార్యదర్శి దీప్తి, కలెక్టర్ ఆలోచనకు కార్యరూపమిచ్చారు. వృథాగా పడేసిన నీళ్ల, శీతల పానీయ సీసాలను పంచాయతీ కార్మికుల సాయంతో సేకరించారు. వాటిలో వాడి పడేసిన పాలిథిన్ కవర్లు బిగుతుగా నింపి ఎకోబ్రిక్‌లు తయారు చేయించారు. ఆకర్షణీయ రంగులతో ఎకోబ్రిక్‌లకు కుండీల రూపమిచ్చి మొక్కలను నాటించారు. బస్ షెల్టర్ హ్యాంగర్‌కు చిన్నచిన్న కుండీలను ఫ్లవర్‌వాజ్‌ల తరహాలో ఏర్పాటు చేసి పూలమొక్కలను నాటారు. చూడగానే వెదురు కర్రలతో తయారైనట్టు కనిపిస్తున్నాయి. చాలా తక్కువ బడ్జెట్‌తో ఉపకరణాలను తయారు చేసుకోవచ్చని ప్రయోగాత్మకంగా చూపిన పంచాయతీ కార్యదర్శి దీప్తిని కలెక్టర్ అభినందించారు.


'ప్రజలు సైతం ఎకోబ్రిక్స్ సాయంతో ఇళ్లలో చిన్నచిన్న కుండీలను తయారు చేసుకోవచ్చు. సామూహిక ఆచరణతో ప్లాస్టిక్ నియంత్రించే అవకాశం ఉంటుంది. పర్యావరణ ప్రాధాన్యంపై అవగాహన కల్పించేందుకు బహిరంగ ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేశాం.'
- దీప్తి, పంచాయతీ కార్యదర్శి

వినూత్న విధానం.. లాభాలు సమీకృతం

పత్తి: ఖమ్మం గ్రామీణం మండల తనగంపాడుకు చెందిన ఓ రైతు రెండెకరాల్లో సాగుచేసిన పత్తి పంట ప్రకృతి వైపరీత్యంతో చేతికందకుండా పోయింది. రూ.80 వేల నష్టం మిగిలింది.

వరి: చింతకాని మండలం చిన్నమండవకు చెందిన మరో రైతు నాలుగెకరాల్లో చేసిన వరి ఇటీవల మున్నేరు వరదలతో దెబ్బ తింది. ఎకరాకు రూ.25-రూ.30 వేల పెట్టుబడి నష్టపోయాడు.

మిరప: కామేపల్లి మండలంలోని పండితాపురంలో 3 ఎకరాల్లోని మిరప మొక్కలను రైతు ఇటీవల దున్నేశారు. అధిక వర్షాలకు వేరు కుళ్లు వచ్చి రూ.50 వేలు నష్టపోయాడు.



'సమీకృత వ్యవసాయం' నమూనా (ఎకరా విస్తీర్ణంలో)

- 10 గుంటలు: మునగ, బొప్పాయి, కోకో, ఆయిల్‌పాం, ఆవకాడో, పనస చెట్ల పెంపకం
- 10 గుంటలు: స్తంభాలపై డ్రాగన్, జాక్ ఫ్రూట్ పండ్ల చెట్ల సాగు
- 10 గుంటలు: తీగజాతి సొరకాయ, మిరప, పసుపు తోటల పెంపకం
- 10 గుంటలు: సోలార్ యూనిట్, ఆక్వా వ్యవస్థ, సేంద్రియ ఎరువుల తయారీ వ్యవస్థ, కోళ్లు/కౌజుపిట్టలు/బాతుల షెడ్, పుట్టగొడుగుల షెడ్, తేనె టీగల పెంపకం, వెదురు కాటేజీ

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

పత్తి, మిరప, మొక్కజొన్న వాణిజ్య పంటలు, వరి వంటి వాటిని సంప్రదాయ పద్ధతుల్లో ఏళ్లుగా సాగుచేయడం వల్ల నేల సారం క్షీణించిపోతోంది. పంట మార్పిడి పాటించకపోవడం, విచ్చలవిడిగా రసాయనాలను పిచికారీ చేయడం, ఎరువులను గుప్పడం, ప్రకృతి విపత్తులు.. వెరసి సాగు రాన్రాను భారమైపోతోంది. సానుకూల వాతావరణంలోనూ పత్తి, వరి, మొక్కజొన్నకు ఎకరాకు రూ.20 వేలు మించి ఆదాయం మిగలడం లేదు. ఇలాంటప్పుడు మూస ధోరణల్లోంచి బయటపడాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచిస్తున్నారు. ఆయన వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో అధ్యయనం చేసి.. 'సమీకృత వ్యవసాయం' నమూనా రూపొందించారు. పలు పథకాల సాయంతో ఎకరాలో ప్రయోగాత్మక సాగు లాభదాయకమని విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ.. తన రెండెకరాల కొబ్బరి తోటలో అంతరపంటగా మునగ సాగుకు ముందుకొచ్చారు. ములకలపల్లి మండలంలో పలువురు రైతులు సమీకృత వ్యవసాయంతో లాభాలు గడిస్తున్నారు.

మునగ: ఎకరా మునగ తోట సాగుకు ఉపాధి హామీ పథకం నుంచి అర్హత గల రైతుకు రూ.1.22 లక్షల సాయం అందుతుంది. 10 నెలల వరకు నిర్వహణ ఖర్చులూ అందుతాయి. పీకేఎం౧ రకం మునగ చెట్టు ఏడాదికి 200 కాయలు కాస్తుంది. ఎకరాలో 30 టన్నుల దిగుబడి వస్తుంది. సగటున టన్ను రూ.8 వేల ధర పలుకుతుంది. గింజల నుంచి తయారుచేసే నూనె ధర లీటరు రూ.3 వేలు ఉంటుంది. ఆకుల నుంచి పచ్చడి, పొడి తయారు చేయొచ్చు. ఈ సాగు.. పత్తి రైతులకు మంచి ప్రత్యామ్నాయం.

అజొల్లా, చేపలు, బాతుల పెంపకం: నీటి వనరులతో వరి పొలాలున్నవారు ఉపాధి పథకం సాయంతో ఫారం పాండ్‌ను 2-4 గుంటల్లో ఉచితంగా తవ్వుకోవచ్చు. కొర్రమేను చేపలు పెంచవచ్చు. పిల్లలకు అజొల్లాను దాణాగా వేయవచ్చు. అజొల్లాను పొలం, చెట్లకు ఎరువుగా, పశువుల మేతగా వాడొచ్చు. బాతులను పెంచవచ్చు. పక్కనున్న పొలాల్లో ఇవి పురుగులు తింటాయి. నీటిని కదిలిస్తాయి. కలుపు నివారణకు దోహదపడతాయి. వాటి వ్యర్థాలు వరికి ఎరువవుతాయి. వరి సాగుదారులకు ఈ విధానం.. అనుకూలం. నీటి వసతి లేని వారైతే మునగ సాగుతో ఆదాయం పొందొచ్చు.

ఎన్‌ఎస్‌పీ స్థలం.. ఆక్రమణల పర్వం..!



ఎన్‌ఎస్‌పీ స్థలం చుట్టూ కట్టిన రిబ్బన్లు

వైరా పాతతండా రైతు వేదిక సమీపంలో విలువైన ఎన్‌ఎస్‌పీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. గతంలో ఎన్‌ఎస్‌పీ కాలువ ఉన్న స్థలంలో ఏడాది క్రితం పట్టణ దవాఖానా నిర్మించారు. ఇంకా విలువైన స్థలం ఉండటంతో గత రెండు రోజులుగా స్థానికులు కొందరు ఆక్రమణకు యత్నిస్తున్నారు. ఆ ప్రయత్నమే ఈ చిత్రం. ఇప్పటికే మధిర రోడ్డు సమీపంలోని రూ.కోట్ల విలువైన ఎన్‌ఎస్‌పీ స్థలాలు కొన్నేళ్ల క్రితమే కబ్జాకు గురయ్యాయంటే అతిశయోక్తికాదు. ప్రస్తుతం రైతు వేదిక నుంచి అయ్యప్ప స్వామి ఆలయం వెళ్లే వైపు ఇదే ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. వంద గజాలు కొనాలంటే రూ.లక్షల్లో పలుకుతుండటంతో ఆక్రమణలకు అడ్డులేకుండా పోతుంది. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
– వైరా, న్యూస్‌టుడే

మెట్టినింటికి అమెరికా కోడలు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉన్నత కొలువు కోసం అమెరికా వెళ్లిన ఇల్లెందు పట్టణానికి చెందిన ఓ యువకుడు అక్కడి యువతిని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ అమెరికా కోడలు మంగళవారం అత్తవారింటికి చేరింది. ఇల్లెందు పట్టణం ఎనిమిదో వార్డుకు చెందిన భోగ నందకిశోర్-విజయ దంపతుల కుమారుడు రాహుల్‌కిశోర్. బెంగళూరులో ఐఐఎం పూర్తి చేసి ఓ ఎంఎన్‌సీలో కొలువు సాధించి కంపెనీ తరఫున 2019లో అమెరికాలోని బోస్టన్ వెళ్లారు. అక్కడ ఉద్యోగం చేస్తూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న అమ్మాయి సోషానతో ప్రేమలోపడ్డాడు. గత డిసెంబరులో ఇరుకుటుంబాల అంగీకారంతో అమెరికాలో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. భారతీయ సంస్కృతిపై ఉన్న మక్కువతో దేశంలోని ఆలయాలు, ఇతర ప్రాంతాలు చూసేందుకు ఈ జంట స్వదేశానికి చేరుకున్నారు. మంగళవారం స్థానిక రామాలయంలో పూజలు నిర్వహించారు.



ఇల్లెందు రామాలయంలో రాహుల్‌కిశోర్ దంపతులు

30న యువజనోత్సవాలు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి యువజనోత్సవాలు 30న ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించనున్నామని డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల వారు పాల్గొనేందుకు అర్హులన్నారు. ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన కళాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని, అక్కడా ప్రతిభ నిరూపించుకున్న వారు జనవరి 12 నుంచి 16 వరకు జరిగే జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీ అంశాల్లో జానపద నృత్యం, జానపద గేయం, వ్యాసరచన, పోస్టర్ తయారీ, వక్తృత్వం, కవిత్వం ఉన్నాయి. ఇదే ప్రాంగణంలో సైన్స్ మేళా ఉంటుంది. సైన్స్ అండ్ టెక్నాలజీ కొత్త ఆవిష్కరణలు ప్రదర్శించే అవకాశం ఉంది. యువకృతి పేరుతో నిర్వహించే పోటీలో హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్రావీణ్యం చూపిన ఇద్దరిని ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తిగల యువ కళాకారులు, సైన్స్‌ఫేర్ ఔత్సాహికులు 29వ తేదీలోగా ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని యువజన క్రీడల కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని ఇతర వివరాలకు 99482 07271 నంబరుకు సంప్రదించాలని అధికారి కోరారు.

నిరంతర శ్రమతోనే విజయం

మధిర, న్యూస్‌టుడే: విద్యార్థులు నిరంతరం శ్రమించి చదివితేనే ఉన్నతస్థాయికి ఎదగవచ్చని హైదరాబాద్ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో మంచి పౌరులుగా రాణించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు పి.నర్సింహారావు జ్ఞానేశ్వరాచారి, కోటేశ్వరరావు, ఆదాం, కిశోర్, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెట్ల వీర విహారం

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: పటేల్ స్టేడియంలోని అథ్లెటిక్స్ శిక్షణ కేంద్రంలోని క్రీడాకారులు ఇటీవల హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో పతకాల పంట పండించారు. మొత్తం 11 మంది క్రీడాకారుల జట్టు 17 పతకాలు సాధించుకొచ్చారు. ఇందులో 5 స్వర్ణాలు, 6 రజతాలు, 6 కాంస్య పతకాలు ఉన్నాయి. పతకాలు సాధించిన క్రీడాకారులు గోపీచంద్, మస్తాన్, అశోక్, ఆఫ్తాబ్, ముబిన్, వివేక్ చంద్ర, వైశాలి, మనుశ్రీ, బిందు, అఫ్రీన్, కృష్ణవేణిలను మంగళవారం ఖమ్మం స్టేడియంలో డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి అభినందించారు. శిక్షకులు గౌస్, అలీం, సుధాకర్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి

తపాలా శాఖ సేవలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఎస్పీ వీరభద్రస్వామి

పినపాక, న్యూస్‌టుడే: తపాలా శాఖ సేవలపై గ్రామస్థాయిలో ప్రజలందరికీ అవగాహన కల్పించాలని ఆ శాఖ ఖమ్మం డివిజన్ ఎస్పీ(సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్) వీరభద్రస్వామి పేర్కొన్నారు. ఉప్పాక వంతెన వద్ద ఓ ప్రైవేటు వేదికలో మంగళవారం నిర్వహించిన బ్రాంచి పోస్టుమాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నమొత్తాల పొదుపు, బీమా, సుకన్య సమృద్ధి యోజన పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ తరహా సేవలందిస్తున్న ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ఖాతాలు తెరవాలని సూచించారు. ఐపీపీబీ మేనేజర్ రాజేశ్, మణుగూరు సబ్‌డివిజన్ అధికారి రామమూర్తి, ఎంవోలు సత్యనారాయణ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

319 కిలోల గంజాయి పట్టివేత



పట్టుపడిన గంజాయి, నిందితులతో అధికారులు, సిబ్బంది

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణ శివారులో వాహన తనిఖీల్లో రూ.79.75 లక్షల విలువైన 319 కిలోల గంజాయి, రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఆబ్కారీ అధికారులు జనార్దన్‌రెడ్డి, గణేశ్, జానయ్య, తిరుపతి, కరంచంద్ విలేకరుల సమావేశంలో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దుల నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా వేర్వేరు ఘటనల్లో ఈ గంజాయి పట్టుబడినట్లు తెలిపారు. వాహనాలతో కలిపి మొత్తం విలువ రూ.1 కోటి ఉంటుందని పేర్కొన్నారు.

★ పెద్దపల్లి జిల్లా కొత్తపల్లికి చెందిన తల్లీకొడుకు నేరళ్ల అపర్ణ, నేరేళ్ల అఖిల్ కారులో హైదరాబాద్ తరలిస్తున్న 100 కిలోల గంజాయిని భద్రాచలం వద్ద సోమవారం స్వాధీనం చేసుకున్నారు. కేసుతో సంబంధమున్న పాత నేరస్థుడు నిజామాబాద్‌కు చెందిన మునావర్ అలీని అదుపులోకి తీసుకున్నారు.

★ ఏపీలో మోతుగూడెం సరిహద్దు ప్రాంతాల నుంచి కారులో అక్రమంగా తరలిస్తున్న 180 కిలోల గంజాయిని సోమవారం పట్టుకుని హైదరాబాద్ బేగం బజార్‌కు చెందిన దత్తు పంచాలను అదుపులోకి తీసుకున్నారు. మరో కేసులో హైదరాబాద్ ఫతేనగర్, బాలానగర్‌కు చెందిన శక్తి రాహుల్, ఇరువురు గోపిశెట్టి అక్షితల నుంచి 14 కిలోలు, 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. తనిఖీల్లో సీఐ రహీమున్నీసాబేగం, ఎస్సైలు అల్లూరి సీతారామరాజు, గౌతమ్, సిబ్బంది బాబు, రాకేశ్, వీరబాబు, కిరణ్, మనోహర్, వెంకట్, లలిత, నీలవేణి, జమాల్, ఆలీ పాల్గొన్నారు.

హైదరాబాద్: నిజామాబాద్‌కు చెందిన పాత నేరస్థుడు మునావర్‌పై 2013, 2017, 2018లలో నిజామాబాద్ రూరల్ నాలుగో ఠాణా, రైల్వే ఠాణాలతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా బచ్చన్నపేట, ఏపీలోని తూర్పుగోదావరి, విజయవాడల్లో కేసులు ఉన్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి వెల్లడించారు.

ఘనంగా సీతారామ కల్యాణం



భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి అర్చన చేశారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన రామయ్య ఇక్కడ దర్శనం ఇవ్వడం భక్తులు చేసుకున్న అదృష్టమని వైదిక పెద్దలు ప్రవచించారు. వైష్ణవ సంప్రదాయం మేరకు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. మంగల్యధారణ కనుల పండువగా సాగింది. అక్షితలను భక్తులకు చూపించి తలంబ్రాల వేడుకను నిర్వహించారు. దర్బారుసేవ వైభవోపేతంగా సాగింది. ఆంజనేయ స్వామివారికి అభిషేకం నిర్వహించి అర్చన చేశారు. జైశ్రీరాం జైహనుమాన్ అంటూ నీరాజనాలు పలికారు. సింధూర బొట్టును నుదట ధరించి భక్తులు హనుమాన్ చాలీసాను పఠించారు. బుధవారం తిరుమంజనం ఉంటుంది.

విద్యుదాఘాతంతో రైతు మృతి

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: చెరువుమాదారం గ్రామానికి చెందిన పరిటాల లింగయ్య(56) మంగళవారం విద్యుత్తు షాక్‌తో మరణించాడు. తన వ్యవసాయ క్షేత్రం సమీపంలోని విద్యుత్ స్తంభం వద్ద మోటారు కోసం తీగలు తగిలించబోగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. తన కుమారుడు చేలో ఎరువు చల్లుతుండగా తాను విద్యుత్ మోటారు సరిచేస్తానని వెళ్లి మృత్యువాత పడ్డాడు. అప్పటిదాకా చేలో పనిచేసిన లింగయ్య మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడున్నారు.

సైబర్ నేరం.. రూ.73 వేలు మాయం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో వచ్చిన లింక్‌ను క్లిక్ చేయడంతోపాటు, వివరాలు నమోదు చేసిన ఓ ఉపాధ్యాయుడు రూ.73 వేలు పోగొట్టుకున్న సంఘటన ఖమ్మం నగరంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానిక మధురానగర్‌లో నివసించే ఉపాధ్యాయుడు కోటయ్య కథనం ప్రకారం... ఆయన వాట్సాప్‌కు సోమవారం రాత్రి ఎస్‌బీఐ పేరుతో లింక్ వచ్చింది. బ్యాంకు నుంచే వచ్చిందని నమ్మిన ఆయన ఓపెన్ చేసి ఖాతా, డెబిట్ కార్డు నంబర్లను నమోదు చేశారు. ఆ వెంటనే ఆయన ఖాతా నుంచి రూ.73,950 నగదు డ్రా అయినట్లు సంక్షిప్త సందేశం వచ్చింది. వెంటనే అప్రమత్తమైన ఆయన బ్యాంకు అధికారులను మంగళవారం సంప్రదించారు. అది తాము పంపింది కాదని, సైబర్ నేరస్థులు పంపిన తప్పుడు లింక్ అని చెప్పడంతో ఖిన్నుడయ్యారు. నగదు డ్రా అయిన అనంతరం పిన్ నంబర్ అంటూ వందకుపైగా సంక్షిప్త సందేశాలు వచ్చాయన్నారు. తన తల్లి పేరిట కూడా బ్యాంకు ఖాతా ఉందని, దాని నుంచి నగదు డ్రా కాలేదని గుర్తించి, ఎటువంటి లావాదేవీలు జరుగకుండా నిలుపుదల చేయించారు. ఘటనపై ఖానాపురం హవేలి, సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కోటయ్య తెలిపారు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
పత్తి	5,500	7,311	6,800
పెసలు	4,000	7,312	6,700
ఏసీ ఎండుమిరప	10,000	20,000	18,000
ఎండుమిరప	8,000	18,500	17,300
ఏసీ తాలుమిరప	9,000	9,000	9,000

నాలుగు వరుసలు.. తీరిన కష్టాలు



సుందరంగా తయారైన కోదాడ-ఖమ్మం జాతీయ రహదారి

నేలకొండపల్లి, న్యూస్‌టుడే

అత్యంత రద్దీగా ఉండే అంతర్ జిల్లా రహదారుల్లో ఖమ్మం- కోదాడ మార్గం ఒకటి. వైద్య, విద్య, ఇతరత్రా అవసరాల కోసం కోదాడ పరిసర ప్రాంతాల నుంచి నిత్యం వేల సంఖ్యలో ఖమ్మానికి వస్తుంటారు. గ్రానైట్, సిమెంటు, ధాన్యం, సున్నపురాయి తదితర వాణిజ్య, ఆహార ముడిపదార్థాల రవాణా ఈ మార్గంలో భారీగా అవుతుంది. గతుకుల రోడ్డులో వాహన రద్దీతో నిత్యం ప్రమాదాలూ సంభవించేవి. ఈ నేపథ్యంలో మూడేళ్ల క్రితం జాతీయ రహదారి (356ఏ) విస్తరణ పనులకు అంకురార్పణ జరిగి దాదాపు నిర్మాణం పూర్తి చేసుకుంది. సూర్యాపేట జిల్లా కోదాడ వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారికి అనుసంధానంగా ప్రారంభమై ఆ జిల్లాలోని అనంతగిరి, ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం గ్రామీణ మండలాల మీదుగా వెంకటగిరి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారుల రింగ్ రోడ్‌కు కలుస్తుంది.

1 తుమ్మల కృషి

ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అప్పటి కేంద్ర ఉపరితల రహదారి మంత్రి నితిన్ గడ్కరీని కలిసి కోదాడ-ఖమ్మం హైవే మంజూరు చేయాలని విన్నవించారు. అప్పటికే అమరావతి-నాగపూర్ రహదారి మంజూరవటం, ఖమ్మం-సూర్యాపేట రహదారి నిర్మాణ దృష్ట్యా ఈ ప్రతిపాదన పక్కనపెట్టేశారు. మంత్రి తుమ్మల పట్టుబట్టిమరీ సాధించారు.

2 రైతుల త్యాగం

రహదారి నిర్మాణానికి ఇరు జిల్లాల్లో 1300 మంది రైతులు 160 హెక్టార్ల భూములు త్యాగం చేశారు. విలువైన భూములను చాలా ఎక్కువ సేకరించారని, పరిహార విషయంలో కొంత అన్యాయం జరిగిందని రైతులు పేర్కొన్నా.. క్షేత్రస్థాయిలో అధికారులు పరిస్థితులు చక్కదిద్దారు.

ప్రాజెక్టు స్వరూపం

- మొత్తం నిడివి: 31.05 కి.మీ.
- జిల్లాలు: సూర్యాపేట (కోదాడ, అనంతగిరి), ఖమ్మం (నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం గ్రామీణం)
- అండర్ పాస్‌లు: 14
- నిర్మాణ వ్యయం: రూ.1039 కోట్లు
- పనులు ప్రారంభం: జనవరి, 2022
- హైవే వాహనాలు ప్రారంభం: 2024, సెప్టెంబరు
- టోల్‌ప్లాజాలు: 1 (పైనంపల్లి)
- రైతులకు చెల్లించిన పరిహారం: రూ.253 కోట్లు

3 వేగంగా నిర్మాణం

రహదారి నిర్మాణానికి 2021లో టెండరు పిలవగా అదానీ సంస్థ దక్కించుకుంది. దీన్ని పవర్‌మెక్ సంస్థ ద్వారా పూర్తిచేయించింది. మొత్తంగా 14 వంతెనలు నిర్మించారు. సుదీర్ఘకాలం పనులతో ఇబ్బంది పడుతున్నామని పైనంపల్లిలో పలుమార్లు స్థానికులు అడ్డుకున్నారు. నిర్మాణానికి వేల టన్నుల మట్టి అవసరమైంది. సుమారు 1000 మందికిపైగా కార్మికులు, వందలాది యంత్రాలు, ప్రైవేటు ఇంజినీర్లు పనిచేశారు. ఒకానొక దశలో మట్టి కొరత ఏర్పడటంతో కలెక్టర్‌లు చెరువులు, కుంటలు, గుట్టలు, క్వారీల నుంచి మట్టిని సేకరించారు.

'జిల్లాలో జాతీయ రహదారులు ఒక్కొక్కటిగా పూర్తవుతుండటం సంతోషాన్నిస్తోంది. ఖమ్మం రహదారులు అద్దాల్లా మెరవాలని ఆకాంక్షించా. అందుకనుగుణంగానే ప్రజల మద్దతుతో నిర్మాణం పూర్తిచేయించాం. రవాణా సౌకర్యం మెరుగుపడితేనే అభివృద్ధి సాధ్యం.'
- తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ మంత్రి



పైనంపల్లిలోని టోల్‌ప్లాజా

'ఇరు జిల్లాల ప్రభుత్వ పెద్దలు, రైతుల సహకారంతో నిర్మాణం దాదాపు పూర్తిచేశాం. మరో 3 కిమీ పరిధిలో కొంత పని మిగిలింది. వాహనాలను సోమవారం నుంచే హైవేపై అనుమతిస్తున్నాం. రహదారి పొడవునా ఇరువైపులా 7మీ వెడల్పుతో సర్వీసు రోడ్డు నిర్మించాం. పైనంపల్లి వద్ద టోల్ వసూలు ఏర్పాట్లు చేశాం. రుసుములను పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశాం. పూర్తయిన దూరానికే టోల్ వసూలు చేస్తాం.'
- వాణి, ఎన్‌హెచ్ఏఐ మేనేజర్

సత్తుపల్లి
•సత్తుపల్లి •మధిర •వైరా

మంత్రిని కలిసిన మత్స్యకారులు


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న మత్స్యకారులు

కారేపల్లి, న్యూస్‌టుడే: కారేపల్లి మత్స్యకారులు కాంగ్రెస్ నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మంగళవారం కలిశారు. స్థానిక పెద్దచెరువు శిఖం భూములు, అలుగు భాగాలు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయని భూములు కాపాడాలని కోరారు. ఆక్రమణలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. తక్షణమే చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. భావితరాల కోసం చెరువు అభివృద్ధి ధ్యేయంగా సమష్టిగా పనిచేయాలని సూచించారు.

ఐదుగురు వీవోఏల తొలగింపు

కారేపల్లి, న్యూస్‌టుడే: పనితీరు సక్రమంగా లేని ఐదుగురు వీవోఏలను తొలగించినట్లు ఏపీఎం సూరజ్ఞాన్ అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలోని దస్త్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. సంఘంలో సభ్యురాలిగా ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించిందన్నారు. క్షేత్రస్థాయిలో వీవోఏలు నిర్లక్ష్యం వహించకూడదన్నారు. మండలంలో 900 మందికి ఇందిరా మహిళా శక్తి రుణాలు ఇచ్చే విధంగా లక్ష్యం ఉందన్నారు. ఏపీఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొణిజర్లలో భారీవర్షం

కొణిజర్ల, న్యూస్‌టుడే: కొణిజర్లలో మంగళవారం రాత్రి భారీవర్షం కురిసింది. సాగర్ కాలువ కింద గండ్లు పడటంతో సాగునీరు రాక పంటలు ఎండిపోతున్నాయి. ఈ సమయంలో మంగళవారం రాత్రి ఒక్కసారిగా భారీవర్షం రావడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. అరగంటపాటు ఏకధాటిగా వర్షం పడింది. వీధులన్నీ జలమయం అయ్యాయి. పెద్దగోపతి, చిన్నమునగాల, పెద్దమునగాల, రెడ్డిగూడెం, ఇతర గ్రామాల్లో సాగర్ జలాలు రాక పొలాలన్ని బీటలు వారి రైతులు సాగునీటి కోసం పడరాని పాట్లు పడ్డారు. ఈ పరిస్థితుల్లో వర్షం రావడంతో వరికి జీవం పోసింది.

సమస్యకు శాశ్వత పరిష్కారం

ఈనాడు కథనానికి స్పందన

కల్లూరు, న్యూస్‌టుడే: 'కాలువ తవ్వారు.. పూడ్చడం మరిచారు' అనే శీర్షికతో ఈనెల 16న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. పెదకోరుకొండి ఎస్సీకాలనీ సిమెంట్‌రోడ్డు, తారురోడ్డుకు మధ్యలో తీసిన గాడిలో శాశ్వత పరిష్కారం కోసం ఎంపీవో ఏసుక సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిమెంట్ పైపులను ఏర్పాటు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

కల్లూరు, న్యూస్‌టుడే: 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికలో భాగంగా ఈనెల 24వ తేదీన ప్రచురితమైన సమస్యపై పంచాయతీ కార్యదర్శి నండిబిల్లి నాగేశ్వరరావు స్పందించారు. స్మశానికి రోడ్డు పక్కన ఉన్న వ్యర్థాలను, పిచ్చిమొక్కలను తొలగించారు.

భిన్న వాతావరణం.. విభిన్న కష్టాలు

కొణిజర్ల, న్యూస్‌టుడే



భిన్న వాతావరణ పరిస్థితులు పంటలు ఎదుగుదల, దిగుబడులపై తీవ్ర ప్రభావం పడనుంది. అధిక వర్షాలు కొన్ని రోజులైతే.. ఎక్కువ ఉష్ణోగ్రతలు మరికొన్ని రోజులు ఇలా విభిన్నమైన మార్పులు వెంటవెంటనే చోటుచేసుకోవడం సాగును ప్రశ్నార్థకంగా చేస్తోంది. ఈ మార్పుల ప్రభావంతో పంటలు కంటికి కనుకులేకుండా చేస్తున్నాయి. పంట ఎదుగుదల, దిగుబడులపై కనపడని ప్రభావం పడటం వల్ల అధిక నష్టాలను చవిచూసే పరిస్థితి ఉంది. వీటిని ఎదుర్కొని సాగును ముందుకు నడిపించాలంటే వ్యవసాయ అధికారుల, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు అత్యవసరం.

పంటలపై ప్రభావం

వాతావరణ మార్పులు వరి, పత్తి, మిరపపై ఎక్కువ ప్రభావం ఉంటుంది. పంటల ఎదుగుదల, దిగుబడులతో పాటు కొత్త రకమైన తెగుళ్లతో కర్షకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాతావరణంతో మెత్తబడిన నేలలు అనంతరం ఉష్ణోగ్రత వల్ల గట్టి పడటంతో వేర వ్యవస్థ దెబ్బతిని ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. పంటలు నీటిని తీసుకునే పరిస్థితులు భిన్నంగా మారడంతో దిగుబడుల తగ్గడానికి కారణమవుతుంది. అధిక వేడి, ఉబ్బ వాతావరణం వల్ల చీడపీడల ఉద్ధృతి పెరిగి కర్షకులపై రసాయన మందుల ఖర్చు అధికంగా పడనుంది. చెరువులు, బావుల కింద వేసిన వరి చిరుపొట్ట దశలో ఉండగా, పత్తి కాయలు పగిలే దశలో ఉంది. పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన రైతులు పెట్టుబడులు పెట్టడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. చేతిలో చిల్లిగవ్వలేక అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. వాతావరణ మార్పుల వల్ల ఎకరానికి సాధారణ పెట్టుబడుల కంటే రూ.5 వేలు అధిక భారం పడనుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరి: ప్రస్తుతం చిరుపొట్టదశలో ఉన్న వరిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉబ్బ వాతావరణం వల్ల సుడిదోమ ఉద్ధృతి పెరిగే అవకాశం అధికం. ఇది నీటిపై భాగంలో దుబ్బులు, మొదళ్ల దగ్గర ఉండి రసం పీల్చడంతో పైరు పసుపు రంగులోకి మారుతోంది.

★ పత్తిలో పేనుబంక, పచ్చదోమ, తామర పురుగు, తెల్లదోమ పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే వర్షాలతో అధిక తేమవల్ల 50 శాతం వరకు నష్టం జరిగింది. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉండటంతో పత్తి రైతు ఆందోళన చెందుతున్నారు.

★ అధిక ఉష్ణోగ్రతల వల్ల మిరపలో కాండం కుళ్లు తెగులు ఆశిస్తుంది. ఇప్పటికే అధిక వర్షాలతో ఈ ప్రభావం ఎక్కువగా ఉండి మొక్కలను మళ్లీ వేసే పరిస్థితి ఉంది. మిరప మొక్కలు నాటడానికే ఎక్కువ ఖర్చు వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- రవికుమార్, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్

రైతులు మారుతున్న వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని పంటలను ఆశించే చీడపీడలను ఎప్పటికప్పుడు గమనించాలి. దానికి అనుగుణంగా శాస్త్రవేత్తల సూచనలతో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. అధిక ఉష్ణోగ్రత, ఉబ్బ వాతావరణంతో వివిధ తెగుళ్లతో వరి, పత్తి, మిరపలపై ప్రభావం ఎక్కువ ఉంటుంది.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు


అంబేడ్కర్ విగ్రహం వద్ద జైభీమ్ యువసేన

వైరా, న్యూస్‌టుడే: శాంతినగర్ ఎస్సీకాలనీలో జైభీమ్ యువసేన యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. రోజు కూలీ పనులకు వెళ్లే వారంతా ఐక్యంగా ఉండి దీనిని ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో పమ్మి దాసు, రమేశ్, నరసింహారావు, నాగభూషణం, చలపతి, దానేలు, కృష్ణసాయి, కాంతారావు, నరేశ్, సైదులు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

చదువు, క్రీడల్లో రాణించాలి


కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికలు

తల్లాడ, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తల్లాడ ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంఈఓ దామోదరప్రసాద్ అన్నారు. తల్లాడ మండలం డాన్‌బాస్కో ఉన్నత పాఠశాలలో తల్లాడ, ఏన్కూరు, వైరా, కొణిజర్ల మండలాల జోనల్ స్థాయి పాఠశాల క్రీడలను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రదీప్‌రెడ్డి, రంజాన్, పాపారావు పాల్గొన్నారు.

జాలిముడి కాలువ గోడ కూలి నీరు వృథా



మండల పరిధిలోని జాలిముడి వద్ద రైతులకు సాగు నీరు అందించటం కోసం ఏర్పాటు చేసిన జాలిముడి ప్రాజెక్టు వర్షాలకు భారీగా వరద నీటితో జలకళను సంతరించుకోగా.. దాని ఎడమ కాల్వ పక్క గోడ మంగళవారం కూలి నీరు వృథాగా పోతోంది. ఈ కాల్వ ద్వారా మల్లారం, రొంపిమళ్ల, సిరిపురం, కృష్ణాపురం గ్రామాలకు సాగునీరు అందుతుంది. గోడ కూలిపోవడంతో సాగు నీరు వృథా అవుతోందని రైతులు పేర్కొన్నారు. వర్షాలకు బుంగ పడటంతో గోడ దెబ్బతిందని, మరమ్మతులు చేయిస్తామని నీటిపారుదల శాఖ డీఈ నాగబ్రహ్మయ్య తెలిపారు.

– మధిర గ్రామీణం, న్యూస్‌టుడే

న్యాయమూర్తుల శ్రమదానం



స్థానిక కోర్టు సముదాయాల ప్రాంగణంలో మంగళవారం హైకోర్టు ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్ వారోత్సవాల్లో భాగంగా శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీనివాస్, సీనియర్ సివిల్‌జడ్జి షేక్ మీరాఖాసీం సాహెబ్‌లు కోర్టు పరిసరాల్లో చెత్త, పిచ్చి మొక్కలు తొలగించారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తేళ్లూరి ఆడమ్స్, సెక్రటరీ రమేశ్, న్యాయవాదులు పి.జానకి రామారావు, కృష్ణప్రసాద్, వెంకటకృష్ణ, దాస్, దర్గావలి, సాంబశివరావు, గోపాలరావు, ఏవో రవి, రవీంద్ర, పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

– సత్తుపల్లి, న్యూస్‌టుడే

శాస్త్రీయ నృత్యంలో కూచిపూడిది అగ్రస్థానం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: శాస్త్రీయ నృత్యంలో కూచిపూడిది అగ్రస్థానమని ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. వెంపాటి మోహన్‌రావు కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో నాట్యాచారిణి అనూష చిన్నారులకు కూచిపూడి శిక్షణ అందించగా వారికి దయానంద్ సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నృత్యకారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న డాక్టర్ మట్టా దయానంద్

స్కేటింగ్ పోటీల్లో చిన్నారి ప్రతిభ


శ్లోకకిరణ్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: ఖమ్మంలో రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కేటింగ్ పోటీల్లో సత్తుపల్లి మండలం గంగారం డీఏవీ స్కూల్ చిన్నారి శ్లోకకిరణ్ ప్రతిభ చాటుకుంది. అండర్-7 కాడెట్ రింక్‌లాప్ విభాగంలో సిల్వర్ మెడల్, రోడ్.3 విభాగంలో స్వర్ణ పతకాలను చిన్నారి సాధించి రాష్ట్రస్థాయిలో జరిగే రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైనట్లు మంగళవారం ఆ స్కూల్ ప్రిన్సిపల్ తణుకు శేషసాయి తెలిపారు. ప్రతిభ చూపిన చిన్నారితోపాటు శిక్షణ ఇచ్చిన పీడీ కె.కుమారస్వామిని ప్రిన్సిపల్ అభినందించారు.

కరకంచె చెట్ల తొలగింపు

మధిర, న్యూస్‌టుడే: మధిర మున్సిపాలిటీలోని 19వ వార్డులో ఉన్న వాటర్ ట్యాంకు సమీపాన ఇళ్ల మధ్య దట్టంగా పెరిగిన కరకంచె చెట్లు, పిచ్చిమొక్కలను మంగళవారం జేసీబీతో తొలగించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు కౌన్సిలర్ మల్లాది వాసు, ధీరావత్ మాధవి సహకారంతో వీటిని తొలగించారు.

పాముకాటుకు గురై కౌలురైతు మృతి

తల్లాడ, న్యూస్‌టుడే: పాముకాటుకు గురై చికిత్స పొందుతూ తల్లాడ మండలం గాంధీనగర్‌తండాకు చెందిన కౌలురైతు బోడా తావు(48)(అలియాస్ చిన్ననరసింహ) మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈనెల 17న కౌలుకు తీసుకున్న వరిపొలంలో రసాయనిక ఎరువు చల్లుతుండగా తావును తాచుపాము కరిచింది. అపస్మారక స్థితిలో ఉన్న తావును చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తావుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచి...


వెంకటేశ్వరరెడ్డి

తల్లాడ, న్యూస్‌టుడే: తల్లాడ మండలం ముద్దునూరు మాజీ సర్పంచి యరమల వెంకటేశ్వరరెడ్డి(57) గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ మంగళవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందారు. రంగాపురం గ్రామానికి చెందిన యరమల వెంకటేశ్వరరెడ్డి ముద్దునూరు సర్పంచిగా రెండుసార్లు, రైతుబంధు మండల కన్వీనర్‌గా, తెదేపా మండల అధ్యక్షుడిగా పని చేశారు. ప్రస్తుతం సొసైటీ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. వెంకటేశ్వరరెడ్డికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కమ్యూనిస్టుల పోరాటం వల్లే పోడు సమస్య పరిష్కారం

కొణిజర్ల, న్యూస్‌టుడే: కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే పోడు సమస్య పరిష్కారమైందని, గిరిజనులకు పోడు పట్టాలు అందాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం పేర్కొన్నారు. తుమ్మలపల్లిలో మంగళవారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనేతరులకు సైతం పోడు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, ఝాన్సీ, నారాయణ, అన్నారపు వెంకటేశ్వర్లు, మల్లయ్య, వీరభద్రం పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలి

కొణిజర్ల, న్యూస్‌టుడే: అడవి జంతువుల కారణంగా దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారానికి ఈనెల 25న జరిగే చలో దిల్లీని జయప్రదం చేయాలని కోరారు. గద్దలగూడెంలో మంగళవారం జరిగిన రైతుసంఘం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. నాయకులు వెంకటేశ్వరరావు, సీతారాములు, రాములు, వెంకటనారాయణ, హనుమంతు, కృష్ణ పాల్గొన్నారు.

గ్రామ తాగునీటి సహాయకులకు శిక్షణ

బోనకల్లు, న్యూస్‌టుడే: పంచాయతీల్లోని తాగునీటి సరఫరా సహాయకులు నీటి సరఫరా, పైప్ లీకేజీలు, బోర్ల మరమ్మతులపై అవగాహనతో ఉండాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీరు శ్రీనివాస్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల్లోని మల్టీపర్పస్ వర్కర్లకు ఆ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎస్ఈ సదాశివకుమార్, డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ పున్నంచందర్, ఏఈలు పాల్గొన్నారు.

ప్రపంచ నదుల దినోత్సవం

కొణిజర్ల, న్యూస్‌టుడే: తనికెళ్ల సమీపంలోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ నదుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. నదులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రిన్సిపల్ శ్రీవాణి తెలిపారు. నదులు కలుషితం కాకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అది అందరి బాధ్యతని పేర్కొన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం వివిధ పార్టీలు, సంఘాల నాయకులతో మాదిగ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. సాల్మన్‌రాజు, కృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

'జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు'

పెనుబల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న జమిలి ఎన్నికల నినాదం భారతదేశ ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని, ఈ ఎన్నికల ఆలోచన విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు అన్నారు. స్థానిక చలమాల సూర్యనారాయణ భవనంలో మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సీపీఎం మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, నల్లమల అరుణప్రతాప్, చలమాల నరసింహారావు పాల్గొన్నారు.

గంగారం పీహెచ్‌సీలో పిల్లలకు వైద్య పరీక్షలు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: గంగారం పీహెచ్‌సీలో మంగళవారం సీడీపీవో ఎన్.కనకదుర్గ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని పలువురు పిల్లలకు వైద్య పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ అవినాశ్ పిల్లలను పరీక్షించి మండలంలో 52 మంది పిల్లలు లోపపోషణతో ఉన్నారని, అందులో 48 మంది పిల్లలకు పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను ఇచ్చామని తెలిపారు.

ఇందిరమ్మ డెయిరీ లబ్ధిదారుల ఎంపిక సర్వే

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ డెయిరీ లబ్ధిదారుల ఎంపికకు సర్వే ముమ్మరంగా సాగుతోంది. గేదెలు కొనుగోలుకు దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు పరిశీలిస్తున్నారు. బీసీ వసతిగృహ సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల పరిశీలన

వైరా, న్యూస్‌టుడే: వైరా మండలంలోని సిరిపురం, పుణ్యపురంలో పత్తి, మిరప, వరి పంటలను మంగళవారం కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో ఆయా పంటల్లో చీడపీడలు ఆశించడంతోపాటు ఇతర వైరస్‌లు సోకడంతో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. కేవీకే శాస్త్రవేత్తలు జెస్సీ సునీత, ఫణిశ్రీ, ముఖేశ్, ఏడీ కరుణశ్రీ, ఏవో మంజుఖాన్ పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

ఏన్కూరు, వైరా, కొణిజర్ల, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల క్రీడా ప్రాంగణంలో శ్రమదానం చేశారు. ప్రధానాచార్యులు మీటకోట సింహాచలం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గూడపాటి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

★ ప్రతి ఒక్కరు సేవా దృక్పథం అలవర్చుకోవాలని ఠాగూర్ విద్యాసంస్థల ఛైర్మన్ వాసిరెడ్డి సునీత పేర్కొన్నారు. జాతీయ సేవా దినోత్సవం సందర్భంగా వైరాలోని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. డైరెక్టర్ సంయోగిత, ఎన్ఎస్ఎస్ పీవో లింగారావు పాల్గొన్నారు.


ఏన్కూరు: కళాశాలలో శ్రమదానం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

★ ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని కళాశాలలో మంగళవారం నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపల్ శ్రీవాణి బహుమతులు అందించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త రజిత పాల్గొన్నారు.

సత్తుపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు సమాజసేవ వైపు మారాలని స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి.రవిశంకర్ అన్నారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ మాట్లాడారు. అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. ★ గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బలుసుపాటి సీతారాములు పాల్గొన్నారు.

మధిర, న్యూస్‌టుడే: విద్యార్థులు సమాజం పట్ల సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.రవీంద్రారెడ్డి సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.సుజాత ప్రసంగించారు. వైస్‌ప్రిన్సిపల్ జి.అరుణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎంఈఓకు సన్మానం


సత్యనారాయణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెనుబల్లి, న్యూస్‌టుడే: చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు విద్యాశాఖాధికారిగా పనిచేస్తూ సెప్టెంబరు 5న గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ మండల విద్యాశాఖాధికారిగా ఎంపికైన వీఎంబంజర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తెనపల్లి సత్యనారాయణను ఆ పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. 12 ఏళ్లకుపైగా మండల విద్యాశాఖాధికారిగా మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ, తన పరిధిలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తూ, పనిచేయించారని ఉపాధ్యాయులు కొనియాడారు. ఎంఈఓ సత్యనారాయణ సేవలు గుర్తించిన కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకోవడం గర్వకారణమన్నారు. వీఎం బంజర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.వి.రామారావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'లాభాల ఘనత ఏఐటీయూసీదే'

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సింగరేణి కార్మికులకు లాభాల వాటా సాధించిన ఘనత ఏఐటీయూసీదేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కొరివి రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక జేవీఆర్ ఓసీలో మంగళవారం దారా భీమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో దండు ఆదినారాయణ, గట్టయ్య, సుధాకర్, నరసింహారావు, సూర్యప్రకాశ్, వెంకటేశ్వర్లు, ఉపేంద్రాచారి, శ్రీనివాస్, బాలసుబ్రహ్మణ్యం, పాషా, రాజశేఖర్, కోటి, సందీప్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కొరివి రాజ్‌కుమార్

ఐక్యతతో క్రైస్తవ సమాజానికి మేలు


సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

వేంసూరు, న్యూస్‌టుడే: క్రైస్తవ సేవకులు ప్రజలతో ఐక్యంగా ఉండడంతో క్రైస్తవ సమాజానికి మేలు జరుగుతుందని అసోసియేషన్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రెవరెండ్ ఏనోష్‌మార్ అన్నారు. వేంసూరు మండలం పల్లెవాడలోని బేతేల్ బాప్టిస్టు చర్చిలో మంగళవారం ఏఐసీసీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పాస్టర్ తేళ్ల ఎబినేజర్ అధ్యక్షతన నిర్వహించిన నిర్వహించిన సేవకుల సమావేశంలో ఏనోష్‌మార్ పాల్గొన్నారు. అనంతరం ఏఐసీసీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోదుగు ఒనేసీము ఉపాధ్యక్షుడిగా బ్రదర్ రామారావు, ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ కె.జాన్‌బిల్‌మోరీ, కోశాధికారిగా పాస్టర్ ఆర్ మోషే, కార్యవర్గ సభ్యులుగా బ్రదర్ సాంబయ్య, కొర్నేలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'తెలంగాణలో ప్రత్యామ్నాయ శక్తిగా భాజపా'

మధిర పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా భారతీయ జనతా పార్టీ ఎదిగిందని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రసంగించారు. భాజపాకి ప్రజల్లో ఆదరణ పెరిగిందని, దేశవ్యాప్తంగా నమోదైన 10 కోట్ల సభ్యత్వాలే ఇందుకు నిదర్శనమన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, యడ్ల అశోక్‌రెడ్డి, విజయరాజు, ఏలూరి నాగేశ్వరరావు, చిలివేరు సాంబశివరావు, రమేష్, నాగేశ్వరరావు, స్వర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, శ్రీధర్‌రెడ్డి

సమస్యల వలయంలో.. పల్లె దవాఖానా

మధిర, న్యూస్‌టుడే


లడక్‌వీధిలో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానా

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు గత ఏడాది ప్రభుత్వం పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మధిర మున్సిపాలిటీలోని లడక్‌వీధిలో అంగన్‌వాడీ కేంద్రానికి నిర్మించిన భవనాన్ని ఎంపిక చేసి పల్లె దవాఖానా ప్రారంభించారు. అనంతరం సక్రమంగా పట్టించుకోకపోవడంతో ఈ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. ఆవరణలోనూ పల్లె ప్రకృతి వనం పేరుతో మొక్కలు నాటడంతో అక్కడకు వెళ్లాలంటే రహదారి సౌకర్యం సరిగా లేని పరిస్థితి. వైద్యం కోసం వెళ్లేవారు చినుకుపడితే అక్కడకు వెళ్లలేని దుస్థితి. ఈ భవనాన్ని నిర్మించి పదేళ్లవుతున్నా విద్యుత్తు సౌకర్యం కల్పించలేదు. దీంతో ఇక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక భవన కిటికీలూ ధ్వంసమయ్యాయి. దీంతో ఇప్పటికే రెండు సార్లు ఈ భవనంలోకి పాములు రావడంతో వైద్యురాలు, సిబ్బంది ఆందోళనకు గురౌతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్తు సౌకర్యంతోపాటు, రహదారిని మెరుగుపరచాల్సి ఉంది. ఈ సమస్యపై వైద్యురాలు వి.హేమలత మాట్లాడుతూ భవనానికి విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేయాలని దరఖాస్తు చేశామని తెలిపారు.

వర్తక సంఘం అధ్యక్షుడిగా నాగుబండి



పెనుబల్లి, న్యూస్‌టుడే: పెనుబల్లి మండలం వర్తక సంఘం అధ్యక్షుడిగా నాగుబండి ప్రభాకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నిర్వహించిన వర్తక సంఘం నూతన కమిటీ ఎన్నికలో మండల ఉపాధ్యక్షుడిగా కొణిజేటి కృష్ణారావు, గౌరవాధ్యక్షుడుగా ఆచంట పుల్లారావు, కోశాధికారిగా కేతేపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా మిట్టపల్లి నరేంద్ర, సహాయ కార్యదర్శిగా పాలెపు సతీష్ ఎన్నికయ్యారు. వర్తక సంఘం నూతన కమిటీకి ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు ఆచంట శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

టీచర్ల రేషనలైజేషన్ నిబంధనల్లో మార్పు చేయాలి

బోనకల్లు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల రేషనలైజేషన్ మార్గదర్శకాలు ప్రాథమిక విద్యకు తూట్లు పొడిచేలా ఉన్నాయని తక్షణమే వాటిని మార్పు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వరరావు(వై.వి) డిమాండ్ చేశారు. మంగళవారం చిరునోముల ఉన్నత పాఠశాలలో జరిగిన సంఘ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. పని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయుల్ని ఆందోళనకు గురిచేయవద్దన్నారు. ఖాళీ పోస్టుల్లో వెంటనే డీఎస్సీ అభ్యర్థుల్ని నియమించాలన్నారు. విద్యార్థులు తక్కువగా ఉండి టీచర్లు ఎక్కువగా ఉంటే సర్దుబాటు చేయవచ్చన్నారు. పెండింగ్ డీఏలు, బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు ఆర్.రంగారావు, బ్రహ్మారెడ్డి, సుజాత, రవికుమార్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు. సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా కొనకంచి రామ్మోహన్‌రావు, మద్దినేని వెంకటేశ్వరరావును, కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యలమద్ది వెంకటేశ్వరరావు

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు


డంపింగ్ యార్డును తరలించాలి: సీపీఎం

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలో ప్రజలకు అసౌకర్యంగా మారిన రాపర్తినగర్ డంపింగ్ యార్డును తరలించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ డిమాండ్ చేశారు. సీపీఎం రెండో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారి ఎన్.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో డంపింగ్ యార్డును తరలిస్తామని మంత్రులు హామీ ఇచ్చారని, తక్షణమే స్పందించాలని కోరారు. సమస్యపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. రెండో పట్టణ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు సీహెచ్.భద్రం, పగడాల నాగేశ్వరరావు, కేయ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో కొత్త కోర్సులు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఐటీఐలో కొత్తగా ప్రవేశపెట్టిన కోర్సుల్లో చేరేందుకు 28 లోపు ఆన్‌లైన్ చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనింగ్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ వంటి కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు.

తెదేపా సీనియర్ నాయకుడి మృతి



నల్లూరి ప్రసాద్

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: రఘునాథపాలెం మండలం పాపటపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నల్లూరి ప్రసాద్(60) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. జిల్లా నాయకుడు కేతినేని హరీశ్‌చంద్ర, నాగండ్ల లక్ష్మణ్, కూచిపూడి జై, కన్నేటి పృథ్వీ తదితరులు నివాళులర్పించారు.

సీపీఎం నేత కన్నుమూత...

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగూడానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు కొప్పుల జనార్దన్‌రావు(71) మంగళవారం మృతి చెందారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు నివాళులర్పించారు.

అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు...

ఖమ్మం కమాన్‌బజార్: ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని ఖమ్మం బుర్హాన్‌పురం అంగన్‌వాడీ కేంద్రం-2 టీచరు సకినాల ఝాన్సీ లక్ష్మి(56) మంగళవారం గుండెపోటుతో మరణించారు. సీడీపీవో వీరభద్రమ్మ, సూపర్‌వైజర్ రాధిక సందర్శించారు. దహన సంస్కారాల నిమిత్తం ప్రభుత్వం తరుపున రూ.20 వేలు అందచేశారు.

గీత కార్మికుల సంక్షేమమే లక్ష్యం: తుమ్మల



గీత కార్మికులకు కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: కల్లు గీత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. నగరంలోని 30 డివిజన్ పంపింగ్‌వెల్ రోడ్‌లో రూ.2 కోట్లతో చేపట్టనున్న సీసీ రహదారి, డ్రైనేజీల నిర్మాణానికి మంగళవారం మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో 100 మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షక కిట్లను పంపిణీ చేశారు. కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా కిట్లను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందన్నారు. కిట్ల ప్రయోజనాలను ఎక్సైజ్ అధికారులు వారికి వివరించాలన్నారు. వైన్‌షాపుల అనుమతులు, బార్‌లను విధిగా తనిఖీ చేయాలని ఆదేశించారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

పర్యటనలో భాగంగా మంత్రి తుమ్మల మార్కెట్ యార్డును సందర్శించారు. మద్దతు ధరను పరిశీలించారు. పెసల చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని సూచించారు. క్వింటాకు ప్రభుత్వం రూ.8,682 మద్దతు ధర చెల్లిస్తోందని తెలిపారు. ఖమ్మం, వైరా మార్కెట్ యార్డుల్లో పెసల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటికే 391 మంది రైతుల నుంచి 4,292 క్వింటాలు మద్దతు ధరపై కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. మున్నేరు వంతెనను పరిశీలించారు. పనుల నిర్వహణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగరంలో సీపీఐ నాయకుడు మహ్మద్ సలాం తదితరుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. మేయర్ పునుకొల్లు నీరజ, నగర కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్రరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ హేమలత, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ముంచిన మున్నేరు.. రైతన్న కన్నీరు

భారీ వర్షం, వరదలతో దెబ్బతిన్న పంటలు

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: భారీ వర్షం, వరదలు అన్నదాతను నిలువునా ముంచాయి. పొలాలు నీట మునిగి, పొలాల్లో ఇసుక మేటలు వేసి ఇప్పటికీ రైతన్నలు కోలుకోలేకపోతున్నారు. ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల్లో పత్తి, మిర్చి, వరి తీవ్రంగా దెబ్బ తిన్నాయి. ఆగస్టు 30, 31, సెప్టెంబరు 7న కురిసిన భారీ వర్షాలకు మున్నేరు, బుగ్గవాగు, చెరువు అలుగులు పొంగి పొర్లాయి. రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో, ఖమ్మం అర్బన్ మండలంలోని పలు ప్రాంతాల్లో పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. వాగుల ఉద్ధృతికి కొన్ని ప్రాంతాల్లో వరి, పత్తి, మిర్చి, వంటి పైర్లు పూర్తిగా దెబ్బతినిపోయాయి. మరికొన్ని నీట మునిగి దెబ్బతిన్నాయి. నీట మునగని ప్రాంతాల్లో అధిక తేమతో పత్తి పైర్ల పూత రాలిపోయి నష్టం వాటిల్లింది. కొన్ని ప్రాంతాల్లో వరదతో పంట పొలాలు కోతకు గురయ్యాయి, మరి కొందరి పొలాల్లో ఇసుక మేట వేసింది. పంట నష్టం కాకుండా, పొలం సరి చేసేందుకు, ఇసుక



ఇసుక మేట వేసిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ(పాత చిత్రం)

మేట తొలగించేందుకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

మిర్చి రైతు కుదేలు... మిర్చి రైతులు భారీ పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తారు. మిర్చి నారు నాటు వేసిన కొన్ని రోజులకే భారీ వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లింది. తిరిగి నారు కొనుగోలు చేయాలంటే మరోమారు భారీగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే బొప్పాయి, కూరగాయల పంటలు ఈ ప్రాంతంలో భారీగా సాగులో ఉన్నాయి. ఈ పంటలకు సైతం నష్టం జరిగింది.

తీరని నష్టం.. రఘునాథపాలెం మండలంలో 681 మంది రైతులకు చెందిన 614 ఎకరాల్లో, ఖమ్మం అర్బన్ మండలంలో 486 మంది రైతులకు చెందిన 621 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ అధికారులు గుర్తించారు. కామంచికల్, దారేడు, పడమటితండా, పాపటపల్లి, వీవీఆర్ బంజర, కోయచలక, కోటపాడు, గణేశ్వరం రైతులు, అర్బన్ మండలంలోని రామన్నపేట, దానవాయిగూడెం, ధంసలాపురం, కొత్తగూడెం, అల్లీపురం, పుట్టకోట ప్రాంతాల రైతులు నష్టపోయారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..

వరదలతో తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నష్టపోయిన రైతులు ఇంకా ఎక్కువగా ఉన్నారని, దెబ్బతిన్న పంటలను మరోమారు క్షేత్రస్థాయి సర్వే చేయాలని రైతులు కోరుతున్నారు.

కార్పొరేషన్ కబుర్లు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ★ నగరంలోని పారిశ్రామిక ప్రాంతం బాలాజీనగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.43 కోట్లతో పట్టణ పీహెచ్‌సీ నిర్మాణానికి ప్రతిపాదించారు.

★ నగరపాలక సంస్థలో పలువురు ఇంజినీర్లు తమ సొంత వాహనాలను అద్దె కార్లుగా వినియోగించడంతో పాటు, నగరపాలక సంస్థకు చెందిన ఒప్పంద డ్రైవర్లను ఆ వాహనాలకు వినియోగించుకోవడం చర్చనీయాంశంగా మారింది.

★ దానవాయిగూడెం, ఇంటేక్‌వెల్ ప్రాంతాల్లో మోటర్లను పునరుద్ధరించడంతో బుధవారం నగరంలో నీటి ఇబ్బందులు తొలగనున్నాయి.

విద్యార్థులూ.. సేవాభావం అలవర్చుకోండి

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.పద్మావతి అన్నారు. ఎన్ఎస్ఎస్ డేను పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సహాయ ఆచార్యుడు ప్రవీణ్, రమేష్, బొంద్యాల, ఎన్ఎస్ఎస్ అధికారి శ్యామలాదేవి పాల్గొన్నారు. వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

జోరుగా తెజస సభ్యత్వ నమోదు

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లాలో తెలంగాణ జన సమితి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతున్నట్లు జిల్లా కన్వీనర్ వి.బాబు తెలిపారు. ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పార్టీ సభ్యత్వాలు ఇచ్చారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నట్లు చెప్పారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య కోదండరాం నాయకత్వంలో పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు జె.రవి, షేక్ సర్దార్, ఎల్.నరసింహారావు, వి.మోహన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన గుగ్గిళ్ల దివ్యమూర్తికి జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. జనకళా వేములవాడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో ఈ నెల 9న ఒకే వేదికపై వివిధ రంగాల కళాకారులు ప్రదర్శననిచ్చారు. దివ్యమూర్తి తన జ్ఞాపకశక్తిని ప్రదర్శించారు. ఆయనకు జీనియస్ బుక్‌లో చోటుదక్కింది. ఎంపీడీవో యర్రయ్య, తహసీల్దార్ మానిక్‌రావు చేతుల మీదుగా మంగళవారం పత్రాన్ని అందుకున్నారు.

'కార్మికుల సంక్షేమ చట్టాన్ని రూపొందించాలి'

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: రవాణా రంగ కార్మికులకు సంక్షేమ చట్టాన్ని రూపొందించి ప్రభుత్వాలు కార్మికులకు అండగా ఉండాలని సీపీఐ జాతీయ నాయకుడు బాగం హేమంతరావు అన్నారు. వరంగల్ క్రాస్‌రోడ్డులో ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ ఆటో క్యాబ్, మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గద్దెను మంగళవారం ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు పేరబోయిన మోహన్‌రావు, సీపీఐ నాయకులు చిన్న వెంకటరెడ్డి, చెరుకుపల్లి భాస్కర్‌రావు, సురేందర్, పెద్దవెంకటరెడ్డి, శంకర్ రెడ్డి, రామకృష్ణ, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదుకు స్పందన

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభిస్తోందని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు అన్నారు. భాజపా లీగల్ సెల్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పసుమర్తి లలిత ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట మంగళవారం భాజపా సభ్యత్వ కార్యక్రమం చేపట్టారు. భాజపా జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, సుగ్గల వెంకట్‌గుప్తా, వెంకటరమణ, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: నగరంలోని 26వ డివిజన్‌లో సభ్యత్వ నమోదు చేపట్టారు. తాండ్ర వినోద్‌రావు, భాజపా జిల్లా అధికార ప్రతినిధి మారుతి వీరభద్రప్రసాద్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పంపు ఆపరేటర్లకు శిక్షణ

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: రఘునాథపాలెం మండలంలో పని చేస్తున్న గ్రామ పంచాయతీ పంపు ఆపరేటర్లకు మోటార్ల నిర్వహణ, ప్రాథమిక మరమ్మతులు వంటి అంశాలపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పుష్పలత పర్యవేక్షణలో స్థానిక రైతు వేదికలో ఏఈ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. మోటార్లు బిగించే విధానం, మరమ్మతు సమయంలో బోరు నుంచి మోటారు బయటకు తీసే విధానం, 5 హెచ్‌పీ, 3 హెచ్‌పీ మోటార్లకు మధ్య తేడా, ఎంత విద్యుత్తు ఖర్చవుతుంది, స్టార్టర్ పని తీరు, వైరింగ్ వంటి అంశాలను వివరించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: పీఆర్‌టీయూ

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు(వైవీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రఘునాథపాలెం మండల శాఖ ఆధ్వర్యంలో సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పీఆర్సీని ప్రకటించాలని, ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి గుర్రం కేశవరావు, వేమిశెట్టి మోహన్‌దాస్, ఉపేందర్ రెడ్డి, నాగమల్లేశ్వరరావు, జబ్బార్, రంగారావు, సైదుబాబు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యుత్తు ఉద్యోగుల సస్పెన్షన్

ఖమ్మం రోటరీనగర్, కూసుమంచి, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించి తోటి ఉద్యోగి గాయపడేందుకు కారణమైన ఇద్దరు విద్యుత్తు ఉద్యోగులు సస్పెన్షన్‌కు గురయ్యారు. కూసుమంచి మండలంలోని పెరికసింగారం లైన్ ఇన్‌స్పెక్టర్ బి.సురేష్, ఏఎల్ఎం సునీల్ కుమార్‌ను డీఈఈ నాగేశ్వరరావు కొద్ది రోజుల కిందట సస్పెండ్ చేశారు. ఏఎల్ఎం రాందాస్ ఎల్‌సీ తీసుకొని విద్యుత్తు పనులు నిర్వహిస్తుండగా, ఎల్‌సీ రిటర్న్ చేయడంతో అతను విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని ఏడీఏ కోక్యానాయక్ ధ్రువీకరించారు.

★ 20న పమ్మి సెక్షన్‌లో జరిగిన ప్రమాదంలో అసిస్టెంటు లైన్‌మెన్ లింగం పున్నయ్య తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. పున్నయ్యని ఎవరూ బయటకు పంపలేదని, తనే ఒక ఫీడర్ బదులు మరో ఫీడర్‌ను పట్టుకుని ప్రమాదానికి గురయ్యాడన్నారు. ఈ ప్రాంతంలో బ్రేకర్ బిగించడంలో నిర్లక్ష్యం వహించారన్న దానికి సమాధానంగా వరద ప్రాంత విధుల కారణంగా ఆలస్యమైందని త్వరలో ఏర్పాటు చేస్తామని డీఈ తెలిపారు.

నగరంలో సినిమాలు శ్రీనివాస: మత్తు వదలరా-2
వినోద: బొమ్మరిల్లు(రెండు ఆటలు), గొర్రె పురాణం(రెండు ఆటలు)
శ్రీతిరుమల: సరిపోదా శనివారం, కేపీఎస్: చిక్లెట్స్, శ్రీసాయిరాం: కళింగ

విద్యార్థినులకు మంత్రి కానుక



విద్యార్థినిని దీవిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, న్యూస్‌టుడే: తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజకవర్గంలోని పేద విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్నారు. 8, 9, 10 తరగతులు చదువుతున్న పీఎస్ఆర్ ట్రస్టు నుంచి వీటిని అందజేస్తున్నారు. పాఠశాల నుంచి 2 కిమీ పైగా దూరం వెళ్తున్న 640 మందిని ఎంపిక చేశారు. కూసుమంచి పాఠశాలలో మంగళవారం 106 మందికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి పొంగులేటి సైకిళ్లు పంపిణీ చేశారు.

రాష్ట్రంలోనే పేరొందాలి: పొంగులేటి: కూసుమంచి, న్యూస్‌టుడే: 'కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలతో పోటీపడాలి. వచ్చే నాలుగేళ్లలో రాష్ట్రంలో ముందు వరుసలో ఉండాలి. కళాశాలకు అన్ని సదుపాయాలు కల్పించే బాధ్యత నాద'ని మంత్రి పొంగులేటి సూచించారు. ఎన్నికల హామీ మేరకు కూసుమంచికి మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలను తాత్కాలికంగా స్థానిక రెవెన్యూ అకాడమీ భవనంలో మంగళవారం ప్రారంభించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ, నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ విజయబాబు, డీఐఈవో రవికుమార్, ప్రధానాచార్యుడు వీరభద్రం, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకురాలు బేబి స్వర్ణకుమారి పాల్గొన్నారు.

రూ.637 కోట్లతో పాఠశాలల్లో మౌలిక వసతులు: విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి పొంగులేటి తెలిపారు. కూసుమంచిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం సభలో మాట్లాడారు. పాఠశాల, ఆస్పత్రుల్లో నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, శ్రీజ పాల్గొన్నారు.

ఆరోగ్యంతో ఆటలు



పాఠశాలల స్థాయి ఆటల పోటీల్లో పాల్గొంటున్న చిన్నారుల ఆరోగ్యాన్ని పట్టించుకునేవారు కరవయ్యారు. పేరుకు ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షణలో జరిగే క్రీడలు అయినా కొన్ని ప్రైవేటు పాఠశాలలపై భారం వేసి చేతులు దులుపుకొంటున్నారు. మైదానంలో ఏర్పాట్లు ఎలా ఉన్న కనీసం స్వచ్ఛమైన తాగునీరు సిద్ధం చేయని పరిస్థితి ఉంది. ఖమ్మం పటేల్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఖమ్మం సౌత్ ఆటలపోటీలకు వచ్చిన చిన్నారులు ఓ డ్రమ్ములో పోసిన నీటిని తాగారు. అందులో ఓ గ్లాస్ ఉంచగా ఆటలాడి వచ్చిన పిల్లలు అదే చేత్తో గ్లాసు ముంచుకొని తాగారు. అనారోగ్యాలకు కలుషిత నీరు కారణం అవుతుందని, తల్లిదండ్రులు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరి మైదానంలో ఈ పరిస్థితి ఉంది. స్టేడియంలో కనిపించిన దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది. – ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో గడ్డి మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై ఖమ్మం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ రమేశ్ కథనం ప్రకారం... బీరోలుకు చెందిన యల్లావుల వెంకటేశ్వర్లు(35) గాంధీనగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. ఆర్టీఓ కార్యాలయ ఏజెంటు వద్ద పని చేసే ఆయన మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం(22న) మద్యం మత్తులో గడ్డిమందు తాగడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

బంగారం, నగదు మాయంపై ఫిర్యాదు

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: బీరువాలో దాచిన బంగారం, నగదు మాయమైన సంఘటనపై రఘునాథపాలెం మండలం మంచుకొండకు చెందిన ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికుడు రామారావు నివాసంలో రెండు తులాల బంగారం, రూ.3 వేల నగదు కనిపించకపోవడాన్ని మంగళవారం గుర్తించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

భార్యపై గొడ్డలితో దాడి

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: అప్పలనరసింహాపురం గ్రామానికి చెందిన మీగడ వెంకటేశ్వర్లు మంగళవారం తన భార్యతో గొడవపడ్డాడు. కోపోద్రిక్తుడై క్షణికావేశంలో భార్య నాగలక్ష్మిపై గొడ్డలితో దాడి చేశాడు. ఆమెకు భుజంపై తీవ్ర గాయాలయ్యాయి. 108లో నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తీసుకెళ్లారు.

ఉత్సాహంగా దక్షిణ మండల క్రీడలు



కబడ్డీ పోటీలో బాలుర హోరాహోరీ

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: నగర దక్షిణ మండల స్థాయి పాఠశాల క్రీడల బాలుర విభాగం పోటీలు మంగళవారం ఖమ్మం స్టేడియంలో ఉత్సాహంగా జరిగాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. 19 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన క్రీడా జట్లు పోటీలో పాల్గొన్నాయి. జోనల్ స్థాయి పోటీలో పాల్గొనే నగర దక్షిణ మండల జట్టును ఎంపిక చేశారు.

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి పాఠశాలల క్రీడలు మంగళవారం ముగిశాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ శ్రీనివాస్, ఎంపీఓ రాజారావు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో పతకాల పంట

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఈనెల 22న ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో సర్వజ్ఞ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎ.నివేదిత సోపి వెండి, కాంస్య పతకాలను సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ ఆర్వీ నాగేంద్రకుమార్ తెలిపారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ నీలిమ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.



సోపిని అభినందిస్తున్న నాగేంద్రకుమార్

చెత్త తొలగించకపోతే చర్యలు: మేయర్

ఖమ్మం కార్పొరేషన్: డివిజన్లలో చెత్త పేరుకుపోతే అక్కడి పర్యవేక్షకులపై చర్యలు తీసుకుంటామని మేయర్ పునుకొల్లు నీరజ హెచ్చరించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుద్ధ్యంపై మంగళవారం సమీక్షించారు. పలు డివిజన్లలో చెత్త పాయింట్ల కారణంగా పారిశుద్ధ్యం పేరుకుపోతోందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెత్త పాయింట్లు ఉండకుండా, ఎప్పటికప్పుడు తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, సిబ్బంది సాంబయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ వ్యక్తి దుర్మరణం

కామేపల్లి, న్యూస్‌టుడే: గార్ల మండలం మద్దివంచకు చెందిన వెంకటరత్నం(45) 8న సాతానిగూడానికి భార్యతో కలిసి బైక్‌పై వస్తుండగా సంత సమీపంలో మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ రవి తెలిపారు.

స్పందించిన దాతృత్వం



ఖమ్మం సాంస్కృతికం: హైదరాబాద్ రామకృష్ణ మఠం, వీహె ఆధ్వర్యంలో మున్నేటి వరద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న డి.వాసుదేవరావు, రాధాకృష్ణ, జయంత్‌పటేల్ తదితరులు

వరద బాధితులకు మంగళవారం పలువురు సాయం అందించారు.



ఖమ్మం కార్పొరేషన్: నిర్మాణ్ ఆర్గనైజేషన్ వారు అందించిన నిత్యావసరాలను బాధితులకు పంపిణీ చేస్తున్న అబ్దుల్ ఖాదర్, సభ్యులు



ఖమ్మం సాంస్కృతికం: ముంపునకు గురైన ప్రాంతాల్లోని బాధిత విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న పోటు ప్రసాద్



ఖమ్మం కార్పొరేషన్: వరద బాధిత పిల్లల కోసం డీఈఓకు సోమశేఖరశర్మకు పుస్తకాలు అందిస్తున్న ట్రస్మా ప్రతినిధులు

నెమలి హతంపై విచారణ

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: చెన్నారం సమీపంలో రెండు నెమళ్లను వేటగాళ్లు చంపి మాంసం తీసుకున్న ఘటనపై అటవీ అధికారులు స్పందించారు. మంగళవారం ఘటనాస్థలాన్ని సందర్శించి నమూనాలు సేకరించారు. ఈకలు, శరీర భాగాలు పరిశీలించారు. జాతీయ పక్షి నెమలిని చంపినా, బంధించినా శిక్షార్హులని హెచ్చరించారు. డీఆర్వో రామారావు, ఎఫ్ఎస్వో డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొంగర గ్రామం వద్ద పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఓ వాహనాన్ని, బియ్యాన్ని ఠాణాకు తరలించారు.

ఎమ్మెల్యే పరామర్శ: కామేపల్లి, న్యూస్‌టుడే: సాతానిగూడెంలో అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త సురేశ్, తాళ్లగూడెంలో మృతి చెందిన అనంతరామయ్య కుటుంబ సభ్యులను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం పరామర్శించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగని దరఖాస్తులు.. అధికారుల అవస్థలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

తమకు నష్ట పరిహారం అందలేదని ఖమ్మం నగరంలోని మున్నేరు వరద బాధితులు లబోదిబోమంటున్నారు. నిత్యం వందలాదిమంది మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులకు ఏం చేయాలో అంతు చిక్కడం లేదు. మున్నేటి వరదలో 9,292 కుటుంబాలు నష్టపోయినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఆయా దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారి ఖాతాలకు రూ.16,500 బదిలీ చేశారు. ఖాతాల నెంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, బ్యాంకు పేరు తప్పుగా నమోదైన వారి ఖాతాల్లో సొమ్ములు పడకపోవడంతో వారంతా కార్యాలయానికి రావడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ తరుణంలో అధికారులు ఆయా డివిజన్లలోనే కేంద్రాలు ఏర్పాటు చేసి సవరణ ప్రక్రియ ప్రారంభించారు. విచారణ సమయంలో తాము ఇళ్లలో లేమని, తమకు పరిహారం



నగరపాలక సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వరద బాధితులు

అందించాలని వందలాది మంది దరఖాస్తు చేయడంతో అధికారులకు ఏమి చేయాలో పాలుపోవడం లేదు. కార్యాలయంలో మూడు రోజులపాటు దరఖాస్తులు సేకరించేందుకు పెట్టె ఏర్పాటు చేశారు. తమకు సమాచారం లేదని వందలాది మంది నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ దరఖాస్తులు పట్టుకొని తిరగడానికి కారణం మాత్రం అధికారులకు అంతుచిక్కడం లేదు.

300కు పైగా దరఖాస్తులు

నగరపాలకంలో సేకరించిన దరఖాస్తులు, డబ్బాలో వేసినవి మొత్తం 300లకు పైగా అందినట్టు అధికారులు పేర్కొంటున్నారు. అయినా మరిన్ని వస్తున్న నేపథ్యంలో వాటి స్వీకరణను నిలిపివేశారు. దీంతో నగరపాలక సంస్థ సిబ్బందితో దరఖాస్తుదారులు వాగ్వాదానికి దిగుతున్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు స్వీకరణ ప్రక్రియ నిలిపివేశామని అధికారులు పేర్కొంటున్నారు. విచారణ సమయంలో తాము ఇళ్లలో లేమని, అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఆదేశిస్తే దరఖాస్తులు తీసుకుంటామని రెవెన్యూ సిబ్బంది స్పష్టం చేస్తున్నారు.